ప్రజల సమస్యలను నాణ్యతతో పరిష్కరించాలి: కలెక్టర్

విశాలాంధ్ర -రాజంపేట: ప్రజల సమస్యల పై క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. పుల్లంపేట మండలం ఎంపీడీవో కార్యాలయాన్ని, ఓబులవారిపల్లి మండలం ఎంపీడీవో కార్యాలయాలను జిల్లా కలెక్టర్ మంగళవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేసి, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే వినతులు, పి జి ఆర్ ఎస్ ద్వారా వచ్చే అర్జీలు, రెవెన్యూ సమస్యలు, ఎన్టీఆర్ జియో ట్యాగింగ్ తదితర అంశాలపై మండల స్థాయి అధికారులు, వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు తదితరులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అర్జీదారులు ఇచ్చిన సమస్యలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించా లన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే వినతులను ప్రాధాన్యతతో పరిష్కరిం చాలన్నారు. విద్యార్థులకు అపార్ ఐడీల జనరేషన్ కు సంబంధించి మాట్లాడుతూ... ఎంఈఓ లు ఎంపీడీవోలు సమన్వయంతో త్వరగా జనరేట్ చేయాలని ఆదేశించారు. ఎన్టీఆర్ ఇళ్ల జియో ట్యాగింగ్ గురించి సమీక్షిస్తూ.... హౌసింగ్ శాఖ వారు మరియు ఎంపీడీవోలు సమన్వయం -5లో

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

బుధవారం 13, నవంబరు 2024 — 8 పేజీలు

సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేటప్పుడు..

విజ్ఞతతో వ్యవహరించాలి

అన్నమయ్య, కడప జిల్లాల ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు

విశాలాంధ్ర-కడప : ఫేస్ బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్స్టాగ్రాం, యూట్యూబ్, టెలిగ్రాం, తదితర సోషియల్ మీడియాలో పోస్టులు పెట్టేటప్పుడు విజ్ఞతతో వ్యవహరించాలని, అన్నమయ్య, కడప జిల్లాల ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు. వర్గాల మధ్య విద్వేషాలు రగిలే విధంగా, వ్యక్తిగత పేరుపైన ఫోటోలు మార్ఫింగ్ చేసిన, మాన అభిమానాలు దెబ్బ తినే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన, అదేవిధంగా సోషల్ మీడియా వేదికగా మతపరమైన, సున్నిత అంశాల్లో అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతి భద్రత లకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే అటువంటి వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసభ్యకరమైన పోస్టులు పెట్టే వారిపై సైబర్ సెల్ సోషల్ మీడియా విభాగం నందు ప్రత్యేక నిఘా ఉంచామని, సదరు చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవన్నారు. అవాస్తవ ప్రచారాలను ప్రజలు ఎవ్వరూ నమ్మవద్దని ఎస్.పి సూచించారు. ఫేక్ న్యూస్ వ్యాప్తి లేదా ఫార్వర్డ్ చేసి వారిపై నిఘా ఉందామని, నిజానిజాలు తెలుసుకోకుండా సోషల్ మీడియా లో పోస్ట్ చేసే వారిపై, షేర్ చేసే వారిపై, సంబంధిత గ్రూప్ అడ్మిన్ల పై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అనాలోచితంగా పోస్టులు పెట్టడం వల్ల జరిగే కీడును గుర్తించాలన్నారు. కులాలు, మతాల మధ్య విద్వేషాలు సృష్టించే పోస్టులు ఎట్టిపరిస్థితుల్లో పెట్టవద్దని సూచించారు. వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతీసే విధంగానూ పార్టీల మధ్య చిచ్చులు పెట్టేలాంటి పోస్టులకు దూరంగా ఉండాలన్నారు. మహిళలు, చిన్నారుల పట్ల అసభ్యకర, అభ్యంతరకర పోస్టులు పెడితే సహించబోమన్నారు. సోషల్ మీడియా అకౌంట్స్, పోస్టులను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సాంకేతిక పరిజ్ఞానంలో సుశిక్షితులైన సి.ఐ మరియు సిబ్బందిచే 24/7 పర్యవేక్షణ చేపట్టామన్నారు. చాలామంది యువత సోషల్ మీడియాకు అలవాటు పడి, సోషల్ మీడియాలో చురుకుగా ఉండాలనే లక్ష్యంతో ఫేక్ అకౌంట్స్ ప్రారంభించి, అనుచిత పోస్టులు పెట్టి, చట్టాన్ని అతిక్రమిస్తున్నారన్నారు. అంతేకాకుండా, తమ విలువైన సమయాన్ని వృధా చేసుకొంటూ, లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమవుతున్నారన్నారు. యువత, ప్రజలు సోషల్ మీడియాను పాజిటివ్ కోణంలో వినియోగించుకోవాలన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకొని నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకోవాలన్నారు. సోషల్ మీడియాలో చురుకుగా ఉన్నామని ఇతరులచే గుర్తింపు పొందేందుకు విద్వేషాలు రెచ్చగొడుతూ, -3లో

సహకార వారోత్సవాలను

విజయవంతం చేయాలి

- జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లాలో 71వ అఖిలభారత సహకార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ జిల్లా సహకార శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో 71వ అఖిల భారత సహకార వారోత్సవాల వాల్ పోస్టర్లను సంయుక్త కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు నవంబర్ 14 నుండి 20 వరకు నిర్వహించుకోబోతున్నామని, వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. నవంబర్ 14 న సహకార మంత్రిత్వ శాఖ యొక్క కొత్త కార్యక్రమాల ద్వారా సహకార సంఘాల బలోపేతం చేయు కార్యక్రమాలు,15న సహకార సంఘాలలో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత మరియు సుపరిపాలన కార్యక్రమాలు, 16న వ్యవస్థాపకత, ఉపాధి కల్పన, నైపుణ్య అభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర కార్యక్రమాలు, 17న సహకార సంఘాలు వ్యాపార ప్రయోజిత సంస్థలుగా రూపాంతరం చెందే కార్యక్రమాలు, 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించే కార్యక్రమాలు, 19 న మహిళలు, యువత మరియు బలహీన వర్గాల కొరకు సహకార సంఘాల కార్యక్రమాలు, 20న సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనలో, మెరుగైన ప్రపంచ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి గురు ప్రకాష్ రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మధు, పాల్గొన్నారు.

కార్మికుల శ్రేయస్సుకు మజ్దూర్ యూనియర్ తోడ్పాటు

విశాలాంధ్ర-నందలూరు : రైల్వే కార్మికుల శ్రేయస్సుకు మజ్దూర్ యూనియన్ తోడ్పాటు నందిస్తుందని జోనల్ జనరల్ సెక్రెటరీ శంకర్రావు అన్నారు. మంగళవారం ఆయన డిసెంబర్ 4,5,6 తేదీ లలో జరిగే కార్మిక సంఘాల ఎన్నికల సందర్భంగా రైల్వే కోడూరు, రాజంపేట, నందలూరు స్టేషన్ లో గల మజ్దూర్ యూనియన్ నాయకులతో కలిసి రైల్వే కోడూరు నుండి కడప వరకు తోటి కార్మికుల కలిసి మాట్లాడారు. మజ్దూర్ యూనియన్ గత 100 సంవత్సరాలుగా కార్మికుల శ్రేయస్సు కోసం ఎంతో కృషి చేస్తూ కార్మికుల కష్టాలకు , ఇబ్బందులకు గురికాకుండా ముందుకు తీసుకెలుతూ ఉందని ఆయన అన్నారు. సికింద్రాబాద్ జోనల్ లెవెల్ లో కార్మికులకు -3లో

మహిళ, యువతే దేశానికి దిశా నిర్దేశం

విజయవంతమైన యువజన కాంగ్రెస్ జిల్లా సమావేశం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : దేశానికి యువతులు, మహిళలకే దిశా నిర్దేశం చేసే శక్తి ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే కాలంలో యువత రాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్లాలని కృతనిశ్చయంతో ఉందని భారత యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమత నాగిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు వెల్లడించారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించా రు. వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ భారత యువ కాంగ్రెస్ ప్రారంభించిన 'శక్తి అభియాన్' ఉద్దేశం రాజకీయాల్లో నిర్ణయాల ప్రక్రియలో మహిళల ఆత్మస్థైర్యాన్ని పెంచి, వారి ప్రయోజనాలకు సమాన స్థానం కల్పించడం. స్థానిక సంస్థలు, శాసనసభలు పార్లమెంటు స్థాయిలో మహిళలే మహిళల ప్రతినిధులుగా వ్యవహరించేలా ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం నడుస్తోంది. 'శక్తి అభియాన్' ద్వారా మహిళల ప్రాధాన్యతను బలపరచి, సమానత్వం తీసుకురావడమే మా లక్ష్యమన్నారు. ఆంధ్ర ప్రదేశ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు మాట్లాడుతు యువకాంగ్రెస్ యువత స్వరాన్ని శక్తివంతంగా చేయడం మరియు మన సమాజాల్లో సానుకూల మార్పు తీసుకు రావడంపై కట్టుబడి ఉంది. రాష్ట్ర మీడియా సెల్ చైర్మన్ తులసిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచడంపై ప్రజల్లో ఆందోళన ఏర్పడిందని ముఖ్యంగా కనిష్ట మధ్యతరగతి ప్రజలు పెరిగిన విద్యుత్ ఛార్జీలు కట్టడం కష్టమవుతుందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో యువత, సాంస్కృతిక, ఉపాధికి ప్రాధాన్యత ఇవ్వక పోవడం అన్యాయమన్నారు. డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి మాట్లాడుతూ జిల్లాలో యువజన కాంగ్రెస్ బలోపేతానికి జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్ ఎనలేని కృషి చేస్తున్నారని దేశం అభివృద్ధి చెందాలంటే యువతే దిశా నిర్దేశం నిర్ణయిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఐసీసీ సభ్యులు బండిజకరయ్య, పెద్ద ఎత్తున మహిళలు, యువతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

జీవో నెంబర్ 77ను రద్దు చేయాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - జమ్మలమడుగు : ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని ఏఐ ఎస్ఎఫ్ జిల్లా కార్య దర్శి జి. వలరాజు, మాజీ విద్యార్థి నాయకులు ఎం.ప్రసాద్ లు పేర్కొన్నారు. మంగళ వారం జమ్మలమడుగు పట్టణంలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ జమ్మలమడుగు ఏరియా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి విద్యా రంగంలోని సమస్యలు స్వాగతం పలుకుతున్నాయన్నారు. ఆ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించే దిశగా ఆలోచనలు చేయాలన్నారు. పాఠశాల విద్య నుండి యూనివర్సిటీ కేంద్రం వరకు అనేక రకాల సమస్యలతో విద్యార్థులు ఉన్నారని తెలిపారు. పులివెం దుల మెడికల్ కళాశాలకు సీట్లు కేటాయించాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ గృహాలకు ప్రభుత్వం నిధులు కేటాయించి, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన జమ్మలమడుగు ఏఐఎస్ఎఫ్ కౌన్సిల్ ఎన్నుకోవడం జరిగింది. కార్యదర్శిగా అరవింద్, అధ్యక్షుడు వినయ్, సహాయక కార్యదర్శులు నూర్, కాసిం, ఉపాధ్యక్షులు ఆదిత్య, విశాల్, రాజా, ట్రెజరర్ షరీఫ్ మరియు కార్తీక్ అరుణ్ లను ఎన్ను కోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయక కార్యదర్శి లీలా కృష్ణ, ప్రొద్దుటూరు నాయకులు పీటర్, తౌసిఫ్, సుబ్బరాయుడు, వాసు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని వారిపై కఠిన చర్యలు:సిడిపిఓ

విశాలాంధ్ర– గాలివీడు: అంగన్వాడి సెంటర్ల లో పనిచేసే హెల్ప ర్లు సమయపాలన పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి పేర్కొన్నారు.మంగళవారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో అంగన్వాడి సహాయకరాళ్లకు ఇచ్చిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఉదయం 8.30 నిమిషాలకు అంగన్వాడి కేంద్రాలకు వెళ్లాలని సాయంత్రం 4 గంటల వరకు అక్కడే విధులను నిర్వహించాలని తెలిపారు. ప్రతి ఒక్కరు పసిపిల్లల ఇంటికి వెళ్లి వారిని అంగన్వాడీ కేంద్రాలకు తీసుకురావా లని తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టిక ఆహారాన్ని ప్రతి ఒక్కరికి అందజేయాలని తెలియజేశారు. సక్రమంగా విధులకు హాజరు కాని వారి పైన, సరిగా విధులను నిర్వర్తించిన వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెనూ ప్రకారం ప్రతిరోజు పిల్లలకు ఆహారాన్ని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు సుజాత రెడ్డి, అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన

విశాలాంధ్ర– పులివెందుల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో మంగళ వా రం మహిళా శి శు సంక్షేమ శా ఖ, ప్రాజెక్ట్ డైరెక్ట ర్ కడప వారి ఆదేశాల మేరకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం, కిశోరి వికాసం విద్యార్థినులకు బాలల న్యాయ చట్టం ,ఫోక్స్ చట్టం తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 తోపాటు పిల్లలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలు ,వాటి బారిన పడకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా సీడీపీవో శ్రీలత, లీగల్ అధికారి సునీతలు మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న పిల్లలు ఏ పని చేసినప్పటికీ ఆలోచించి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా జాగ్రత్త పడాల న్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని అప్పుడే మీరు అనుకున్నటువంటి గమ్యాన్ని చేరుకోగలరని, తొందరపాటు నిర్ణయాలతో చక్కటి భవిషత్ ను కోల్పోకూడదన్నారు. మంచి చెడులు గ్రహిస్తూ అవగాహనతో నడుచుకున్నప్పుడే వారి ఉజ్వల భవిష్యత్తు కు బాటలు వేసిన వారు అవుతారన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ నాగేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటింటా సౌభాగ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యం: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: ఇంటింటా సౌభాగ్యమనేది కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఏఐసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి సర్కారు ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాలు అట్టర్‌ఫ్లాప్ అయ్యాయన్నారు. ఇక ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ప్రతిపక్షపార్టీ వైసీపీ అధినేత జగన్ అసెంబ్లీకి వెళ్లకుండా ఇంటిలో మైకు వద్ద కూర్చుని విమర్శలకు దిగుతున్నారు. గత వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ విధ్వంసానికి గురైంది. చంద్రబాబు పాలన కూడా ఘోర వైఫల్యం చెందుతోందన్నారు. రాష్ట్రం లో కూటమి పాలనలో సూపర్ 6 పథకాలు సూపర్ ఫ్లాప్ అయ్యాయని, ఇందుకు సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ తో తేలిపోయిందన్నారు. కొన్ని పథకాలకు బడ్జెట్ లో కేటాయింపులు లేవని, మరి కొన్నింటికి అరకొర కేటాయింపులు చేశారన్నారు. యువతను నమ్మించి మోసగించింది.నిరుద్యోగ భృతి క్రింద కేటాయింపులు లేవు.యువజన,పర్యాటక,సాంస్కృతిక శాఖకు నామ మాత్రపు కేటాయింపు రు 322 కోట్లు .కూటమి ప్రభుత్వం యువత క్రోధాగ్నికి గురికాక తప్పదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం మహిళలను కూడా నమ్మించి మోసగించింది.మహా లక్ష్మి పథకం క్రింద కేటాయింపులు లేవు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పై స్పష్టత లేదన్నారు. తల్లికి వందనం పథకం క్రింద ఏడాదికి రు 12,600 కోట్లు కావలసి వుండగా,రు 5387 కోట్లు మాత్రమే కేటాయించారు. అన్నదాత సుఖీభవ పథకం అమలుకు రు 10,717 కోట్లు అవసరం కాగా కేటాయింపు రు 4,500 కోట్లు మాత్రమే అన్నారు. విద్యా దీవెన,వసతి దీవెన పథకాల ఊసే లేదని, అప్పుల్లో మాత్రం ఆల్ టైమ్ రికార్డు.2024- 25 ఆర్థిక సంవత్సరం లో చేయబోయే అప్పు రు 91,443 కోట్లు అన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసగించింది.రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లు గా తయారయిందన్నారు. వైకాపా పార్టీ కప్పుకోను చాలదు, కట్టుకోను చాలదు అన్నట్లు తయారయింది.అధికార పార్టీకి పనికిరాదు,ప్రతిపక్ష పార్టీకి పనికి రాదని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ రాజ్యం రావాలంటే,ఇంటింటా సౌభాగ్యం వెల్లివిరియాలంటే ఒక్క కాంగ్రెసు తోనే సాధ్యమని స్పష్టంచేశారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం: ఎస్ఐ

విశాలాంధ్ర- గాలివీడు: క్రీడల తోనే మానసిక ఉల్లాసం కలుగు తుందని గాలివీడు యస్.ఐ రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రవి చంద్ర సీబీఎస్ ఈ పాఠశాల,గౌతమ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు సంయుక్తంగా గౌతమ్ ఇంగ్లీష్ పాఠశాల ప్రాంగణంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి క్రీడా పోటీలను పాఠశాల యాజమాన్యం,సైజూ థామస్, శింటో ఇమ్మానేయుల్ ఆధ్వర్యంలో ఆయన ప్రారంభిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలకు కూడా అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థి దశ నుండే క్రమ శిక్షణతో మెలగి నేటి భావి భారత పౌరులుగా తయారు కావాలన్నారు.ఈ పాఠశాల యాజమాన్యం క్రీడలకు ఇంత ప్రాధాన్యం ఇవ్వడం చాలా సంతోషకరం అన్నారు.ఈ కార్య క్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లు లిజా జాయ్, లిక్సన్ పాల్,ఉపాధ్యాయబృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

తమిళనాడు ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలోని స్వామి నివాస గృహ సమీపంలో తమిళనాడు ట్రస్టు ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర స్వామి 416 జయంతి సందర్భంగా నేడు బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తమిళనాడు ట్రస్ట్ చైర్మన్ జయ రామన్ కోశాధికారి సుందర్ రాజన్ సెక్రెటరీ రవిచంద్రన్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్స రం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి సందర్భంగా గత 11 సంవ త్సరాలుగా ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తు న్నామన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం నుండి అన్నదాన కార్యక్రమాలను కుల మతాల కచ్చితంగా నిర్ణయించడం జరుగు తుందని ప్రతి ఒక్కరు ఈ అన్నదాన కార్యక్రమం లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విభిన్న ప్రతిభావంతుల దినోత్సవానికి తరలిరండి

విశాలాంధ్ర– నందలూరు : రాజంపేట విభిన్న ప్రతిభావంతుల పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ నందలూరు మండలంలోని విభిన్న ప్రతిభావంతు లందరూ డిసెంబర్ 12వ తేదీన రాజంపేట నందు పార్లమెంటు స్థాయిలో నిర్వహించబోయే ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా నందలూరు మండలంలోని విభిన్న ప్రతిభావంతులందరూ పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేయవలసిందిగా కోరడం జరిగింది అలాగే నందలూరు మండల నూతన అధ్యక్షునిగా అలుసూరి శివకోటిని నియమించడం జరిగింది. అలుసూరి శివకోటి తన యొక్క బాధ్యతలను దిగ్విజయంగా నిర్వహించాలని సూచించడం జరిగింది. అధ్యక్షుడు అలసూరి శివకోటి మాట్లాడుతూ నందలూ రు మండలంలోని విభిన్న ప్రతిభావంతులందరూ పార్లమెంటు స్థాయిలో నిర్వహించబోయే కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ పాల్గొని పండుగ వాతావరణం గా ఈ యొక్క కార్యక్రమాన్ని నిర్వహించుకోవడానికి నందలూరు మండలం నుండి తరలి వెళ్లాలని కోరడం జరిగింది అలాగే భవిష్యత్తులో నందలూరు మండలంలోని విభిన్న ప్రతిభావంతులకు ఎటువంటి సమస్యలు వచ్చినా తాను ముందు ఉంటానని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం నందు పుల్లంపేట అధ్యక్షుడు సుబ్బనరసారెడ్డి, రాజంపేట ఉపాధ్యక్షుడు ఖాదర్ భాష, సెక్రెటరీ వెంకట ప్రసాద్, సభ్యులు వెంకటసుబ్బయ్య, మౌలాలి ,జాకీర్ పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకునిగా ఆర్. నీలయ్య

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకునిగా ఎంపికైన ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు అసోసియేట్ ఎన్.సి.సి అధికారిగా పనిచేస్తున్న లెఫ్టినెంట్. డా. ఆర్.నీలయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ చే ఉత్తమ అధ్యాపక అవార్డును అందు కోవడం జరిగింది. ఈ సందర్భంగా కళాశా ల ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి.రవీంద్రనాథ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు అభినంద నలు తెలియజేయడం జరిగింది.

భాగవతులకు సన్మానం

విశాలాంధ్ర-పులివెందుల: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పులివెందులకు చెందిన భాగవతు లకు సన్మానం లభించింది. సత్యవేడు మండలం శ్రీసిటీ ఆరూర్ నర్సరీలో వారం రోజుల పాటు నిర్వహించిన భాగవత పఠనం మంగళవారంతో పూర్తయింది. ముగింపు సందర్భంగా శ్రీసిటీ ఎండీ రవిచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో భాగవత పఠనం దిగ్విజయంగా పూర్తి చేసు కుంది. ఈ క్రమంలో భాగవతులు రామిరెడ్డి నారాయణరెడ్డి, తొండూరు నారాయణరెడ్డి, అర్చకులు రామసుబ్బారెడ్డి, రవిచంద్రారెడ్డి యాగంటి బాలకృష్ణారెడ్డిలను సత్కరించారు.

వందశాతం అక్షరాస్యత సాధనపై శిక్షణ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండల పరిధి లోని నిరక్షరాస్యుల్లో విద్య పట్ల అవగాహన కల్పించడం ద్వారా వారిని చదువు వైపు ఆకర్షితులను చేయాలని తద్వారా వంద శాతం అక్షరాస్యత సాధించాలని ఎంపీడీవో వెంకటరమణ, ఈవోపీఆర్డీ రంతుల్లయ్య ఉద్బోధించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో మంగళవారం డ్వాక్రా సంఘాల ఆనిమేటర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై సలహాలు సూచనలు చేశారు. కేరళ రాష్ట్ర తరహాలో మన రాష్ట్రంలో కూడా వంద శాతం అక్షరాస్యత సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోం దని గుర్తుచేస్తూ నిరక్షరాస్యులను అక్షరాస్యు లుగా తీర్చిదిద్దేందుకు సదరు యంత్రాంగం కృషి చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం జగదీశ్వరితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

వెంకట్‌రెడ్డి మృతదేహాన్ని నివాళులర్పించిన చింతల

విశాలాంధ్ర -గుర్రంకొండ: సంఘసముద్ర గ్రామం ఎల్లంపల్లి కి చెందిన వైఎస్ఆర్‌సిపి పార్టీ కార్యకర్త కొంకల రమణారెడ్డి అనారో గ్యంతో మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి రమణారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వారి కుటుంబానికి మనోధైర్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు యోగేంద్ర మాజీ పల్లె జీవం ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి ఉపసర్పంచ్ చిన్న రెడ్డప్పరెడ్డి, సుబ్బారెడ్డి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గూడెంచెరువులో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - జమ్మలమడుగు : జమ్మలమడుగు మండలంలోని గుడం చెరువు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించినట్లు మం డల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం గుడంచెరువు గ్రామ రైతుల సమక్షంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఊరిలో ఉత్తమ యాజమాన్యం పద్ధతులు, ఎరువులు వాడకం, వరి పంటలను ఆశించే ఆకుము దుత, వరి, నల్లి, మెడ విరుపు, తెగులు వంటి చీడపీడతల సంరక్షణ పద్ధతులను తెలిపారు. అలాగే రైతులకు రబీ సీజన్లో సాగు చేసే పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా ప్రీమియం చెల్లించే విధానం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు శివశంకర్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర- మదనపల్లె : 57వ గ్రంథాలయ వారోత్స వాలను ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహిం చనున్నట్లు స్థానిక శాఖ గ్రంథాల యాధికారి ఆర్. వసంత కుమారి తెలిపారు. ఈ మేరకు గ్రంథాలయ వారోత్సవాల ఆహ్వాన పత్రికలను మదనపల్లె ఇన్చార్జ్ సబ్ కలెక్టర్ రాఘవేంద్ర, ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి, కమిషనర్ ప్రమీలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14వ తేదీ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలు జరుగుతాయని ఇందులో భాగంగా బాలల దినోత్సవం నిర్వహిస్తామన్నారు. 15వ తేదీన పుస్తక ప్రదర్శన ఏర్పాటు, మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యతపై సదస్సు నిర్వహిస్తామ న్నారు. 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల గురించి స్మరించుట, 17న కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు, 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వకృత్వ, క్విజ్, క్రీడల పోటీలు నిర్వహణ,19వతేదీన మహిళలకు వివిధ కార్యక్రమాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. 20వతేదీన డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నవలా రచయిత టీ.ఎన్.ఏ.క్రిష్ణమూర్తి, డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు, విశ్రాంత ఉపాధ్యాయులు రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: మండలం రాఘవ రాజుపురం గ్రామానికి చెందిన దేశూరి వెంకట్రామిరెడ్డి ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరం.ఆ కుటుంబానికి అండగా ఉంటాం అని వైసిపి సీనియర్ నాయకులు అన్నమయ్య జిల్లా వ్యవ సాయ సలహా మండలి మాజీ ఛైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి అన్నా రు. మంగళవారం రాఘ వరాజుపురం గ్రామానికి వెళ్లి వెంకట్రామి రెడ్డి మృత దేహంపై పూల మాలవేసి నివాళులు అర్పించారు. జెడ్పిటిసి పాలెంకోట రత్నమ్మ, దొంతిరెడ్డి శివారెడ్డి, రాజారెడ్డి, పాలెంకోట చంద్రయ్య తదితరులు వెళ్లి మృత దేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు.

గ్రామసభలతో భూసమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర- యర్రగుంట్ల : దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల్ని రీసర్వే ద్వారా పరిష్కరి స్తామని గత వైకాపా ప్రభుత్వం చెప్పుకొచ్చిం ది. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో హద్దు లు గుర్తించే ప్రక్రియ చేపట్టింది. కానీ పరిష్కారం మాట అటుంచితే కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. రీ సర్వే అంతా తప్పుల తడకగా మారింది. వేలాది మంది బాధితులుగా మిగిలారు. వాటిని సరిచేసు కునేందుకు భూ యజమానులు, రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వా నికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో రీసర్వే చేపట్టిన ప్రాంతాల్లో మళ్లీ గ్రామసభల ద్వారా వాటి పరిష్కారానికి చొరవ తీసుకుంది. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు జరిగిన గ్రామసభల్లో 85కు పైగా ఫిర్యాదులు వచ్చాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మండలంలో 16 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇందులో గత ప్రభుత్వ హయాంలో 14 గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. ఆయా గ్రామాల్లోని భూ సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా ప్రస్తుత ప్రభుత్వం గత నెల (అక్టోబర్) 18వ తేదీ నుండి గ్రామసభలు నిర్వహిస్తోంది. ఇవి డిసెంబర్ 10 వరకు కొనసాగనున్నాయి. వైకాపా ప్రభుత్వం భూ సమస్యలకు శాశ్వత పరిష్కా రం పేరుతో 2020 డిసెం బరులో రీ సర్వే ప్రారంభిం చింది. ఈ ప్రక్రియ పూర్తి చేసిన భూములను భూ యాజ మాన్య హక్కు చట్టం పరిధిలోకి తీసుకురావడంతో అప్పట్లో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో అర్హులైన రైతులు వారి భూములపై శాశ్వత హక్కులు కోల్పోయిన పరిస్థితులు తలెత్తాయి. కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు, భూ విస్తీర్ణం, రైతుల పేర్లు ఇతర వివరాల్లో తప్పులు ఉండడంతో రుణాలు పొందలేని దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సర్వేను నిలిపివేసింది. వీటిని గ్రామసభల ద్వారా చక్కదిద్దే దిశగా చర్యలు తీసుకుంటోంది.

త్వరితగతిన పరిష్కారం - తాహసీల్దార్ శోభన్‌బాబు: గ్రామసభల ద్వారా డిసెంబర్ 10 వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామని మండల తాహసీల్దార్ శోభన్‌బాబు పేర్కొన్నారు. భూ సమస్యలపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన వివరించారు. వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని శోభన్‌బాబు తెలిపారు.

రైతులకు పెట్టుబడి సాయం తక్షణమే అందించాలి: సీపీఐ

విశాలాంధ్ర-వేంపల్లి: కూటమి ప్రభుత్వం ఎలక్షన్ హామీ గా ఇచ్చిన రైతులకు పెట్టుబడి సహాయం 20 వేల రూపాయలను వెంటనే అందించాలి సిపిఐ డిమాండ్ చేసింది. స్థానిక వేంపల్లి ఎస్ టి యు కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాము లు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు మేము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఏటా పెట్టుబడి సాయం కింద 20 వేల రూపాయలు అందజేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు, కాగా అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఎన్డీఏ ప్రభుత్వం ఎన్టీఆర్ రైతు భరోసా పథకం కింద ఇచ్చే పెట్టుబడి సాయం గురించి ఏమాత్రం పట్టించుకోక పోవడం దారుణం అన్నారు, అదేవిధంగా అకాల వర్షాల వల్ల నష్టపోయిన పంట రైతుల జాబితాను సిద్ధం చేయకుండా ఎంత మేరకు పంట నష్టం జరిగింది తెలుసుకోకుండా రైతుల పట్ల ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో స్పష్టం అవుతుం దన్నారు, కావున ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎన్డీఏ ప్రభుత్వం తక్షణమే పెట్టుబడి సాయం 20 వేల రూపాయలు మంజూరు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వానికి తెలియజేశారు సమావేశంలో సిపిఐ వేంపల్లి మండల కార్యదర్శి అంజనప్ప సిపిఐ వేముల మండల కార్యదర్శి చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మిట్స్‌లో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీస్‌పై అవగాహన

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లె సమీపం లో గల మదనపల్లె ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల నందు అన్‌లాకింగ్ గ్రోత్: స్మార్ట్ మార్కెటింగ్ మరియు ఎంపవర్నింగ్ ఎంట్రప్రెన్యూర్స్ కోసం ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ (ఏ ఐ) టెక్నాలజీస్ అను అంశం పై అతిథి ఉపన్యా సం ను ఏర్పాటు చేసి నారు. ఈ కార్యక్రమానికి కళాశాల పూర్వ విద్యార్థి తస్లీమ్ కౌసర్, ఇన్వెస్టర్ ఎంగేజ్‌మెంట్ మేనేజర్, టాబ్లాన్, దుబాయ్ పాల్గొన్నారు. కార్యక మం లో ఆమె మాట్లాడుతూ మేనేజ్మెంట్ రంగం లో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ పాత్ర గురించి విద్యార్థులకు వివరించా రు. వ్యాపారాలకు, ప్రత్యేకించి చిన్న మరియు మధ్య తరహా సంస్థలు మరియు స్టార్టప్‌ల కు, వారి మార్కెటింగ్ ప్రయత్నాలను ఆప్టిమైజ్ చేయడానికి, కస్టమర్ ఎంగేజ్‌మెంట్‌ను మెరుగు పరచడానికి, స్థిరమైన వృద్ధిని పెంపొందించడానికి ఈ సాంకేతికతలు సహాయపడతాయని తెలిపారు. తాజా ఏ ఐ ట్రెండ్‌ల గురించి మరియు ఈ సాంకేతిక తలు మార్కె టింగ్ ల్యాండ్‌స్కేప్‌ను ఎలా పునర్నిర్మిస్తున్నా యనే దాని గురించి విద్యా ర్థులకు తెలుపు తూ, వృ ద్ధి మరియు ఆవిష్కరణ లకు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నారు అని తెలిపారు . విద్యా ర్థులు తమ వ్యవస్థాపక వెంచర్‌లలో ఏ ఐ ని అమలు చేయడం గురించి, వ్యాపార ఫలితాలను ఆప్టిమైజ్ చేయడానికి డేటాను మరియు ఆటోమేషన్ ను ప్రభా వితం చేయడంపై విలువైన సంచారాలికి ఆమె అందించారు. ఏ ఐ అనేది కేవలం సాంకేతిక ధోరణి మాత్రమే కాదని, డిజిటల్ యుగంలో వ్యాపార విజయాన్ని సాధించడంలో కీలకమైన పాత్ర పోషిస్తున్నదని, విద్యార్థులు నూతన టెక్నాలజీ పై శ్రద్ధ వహించాలని ఆమె అన్నారు. కార్యక్రమం లో ప్రొఫెసర్ కృష్ణా, పూనమ్ సాహూ, అఖిలేష్ కుమార్ మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

విశాలాంధ్ర- మదనపల్లె : మదనపల్లె క్లస్టర్ పరిధిలోని మద నపల్లె, కురబల కోట, పెద్దమండ్యం మండలాల్లో ఏపీడీ గోకు లం నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయా లని ఏపీడీ మధుబాబు పేర్కొన్నారు. మంగళ వారం మదనపల్లి పట్టణంలోని సిఎల్ఆర్సి భవనంలో గోకులం షెడ్ల లబ్దిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీతో కల్పించిన గోకులం షెడ్లను త్వరితగతిన పూర్తి చేసి తద్వారా పశు పోషణాభివృద్ధితో పాలను డైరీలకు విక్రయిస్తూ ఆర్థికాభివృద్ధి పొందాలని ఆకాంక్షించారు. రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాయి తీ షెడ్లను నిర్మించుకొని, తద్వారా ఆర్థిక అభి వృద్ధి పొందాలని తెలియజేశారు.

..విజ్ఞతతో వ్యవహరించాలి

(మొదటి పేజీ తరువాయి) శాంతిభద్రత లకు విఘాతం కలిగించే వారిపైనా, వారిని ప్రోత్సహించే వారిపైనా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని అన్నమయ్య మరియూ కడప జిల్లాల ఎస్పీ .వి. విద్యాసాగర్ నాయు డు ఐపీఎస్ నెటిజన్లను హెచ్చరించారు.

..యూనియన్ తోడ్పాటు

(మొదటి పేజీ తరువాయి) ఎటువంటి కష్టాలు వచ్చినా వారి వెంట ఉండి అధికారు లతో మాట్లాడే సమస్యను పరిష్కరిస్తూ ముం దుకు పోతున్నామని ఆయన అన్నారు. కార్మికులకు ఉన్న హక్కులను కాలరాసేందుకు ప్రస్తుత భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం వారికి అనుగుణంగా మార్పులు చేసుకుంటూ ముందుకు పోతున్నారన్నారు. దీనిని కట్టడి చేయా లంటే జాతీయస్థాయిలో ఒకే యూనియన్ గా ఉండి పోరాడ దానికి శక్తిని కార్మికులు అందిస్తే కార్మికుల సమస్యలకు యూనియన్ తోడ్పాటును కల్పిస్తుందన్నారు. దీనిని కార్మికుల గమనించి రాబోవు ఎన్నికల్లో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ యొక్క జెండా గుర్తుకు ఓటు వేసి గెలిపిం చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గుంత కల్ డివిజనల్ సెక్రటరీ విజయ్ కుమార్, డివిజనల్ ప్రెసిడెంట్ సుదర్శన్, నందలూరు యూనియన్ చైర్మన్ గోపీనాథ్, సెక్రటరీ విశ్వనాథ్, అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.ఎం.భాష, మాజీ సెక్రటరీ కమలాకర్, సుదీర్, సిద్దయ్య, శివకుమార్ రాజు, నిచయ్ కుమార్ సిన్హా, మణి, పిరయ్య, పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు నాగిరెడ్డిపల్లి విద్యార్థి

విశాలాంధ్ర- నందలూరు : మండలం లోని నాగి రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాల కు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థి సయ్యద్ ఉమర్ ఉస్మాన్ అలీ కబడ్డీ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. సోమవారం బాపట్ల లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అతను తన ప్రతిభ చూపాడు. ఇందుకోసమై వ్యాయామ ఉపాధ్యాయురాలు గౌరీ విశేషమైన కృషి చేశారు. పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు జయలలిత కుమారి, ఇతర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థి ఉమర్ ఉస్మాన్ అలీని, వ్యాయామ ఉపాధ్యాయురాలు గౌరీనీ అభినందించారు.

భద్రతా నియమాలు ప్రతిఒక్కరూ పాటించాలి: ఎంవిఐ

విశాలాంధ్ర-మదనపల్లె : రహదారి భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని వాహన దారులకు మదనపల్లె మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ (ఎంవిఐ) శివలింగయ్య సూచించారు. మంగళవారం బెంగళూరు రోడ్డులో తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వ హించారు. ఇందులో భాగంగా రికార్డులు లేని వాహనాల కు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎంవిఐ శివలింగయ్య మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో తగుజాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి వాహనానికి రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని, సీట్ బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ఉపయోగించాలని, వాహనాలు నడిపే సమయంలో సెల్ ఫోన్ మాట్లాడకూడదని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో అజాగ్రత్తగా వ్యవహరిస్తే కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని హెచ్చరించారు. ఇప్పటికే ఆర్టీఓ కార్యాలయం ద్వారా పలుమార్లు అవగాహన కల్పించడాన్ని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పురపాలక ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: నగరపాలక పురపాలక ఉపాధ్యాయులకు ఆర్థిక నష్టం కలగకుండా వెంటనే రేపటి లోపు పదోన్నతులు కల్పించాలని ఎస్.టి.యు నాయకులు ఆజేడి కి వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్ర పాఠశాల విద్య శాఖ పురపాలక ఉపాధ్యాయులకు పదోన్న తులు నవంబర్ నెల 6తేదీన ప్రధానోపాధ్యాయులకు, 8వ తేదీన స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించమని షెడ్యూల్ విడుదల చేసిందని కానీ ఆ షెడ్యూలు నేటికీ పూర్తి కాలేదని వెంటనే షెడ్యూల్ ప్రకారము పదోన్నతులు కల్పించి ఆర్థిక నష్టం లేకుండా చేయాలని రాష్ట్ర ఉపాధ్యా య సంఘం జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ భాష,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కె.సురేష్ బాబు,రాష్ట్ర ఉపాధ్యక్షు లు కే.బాలగంగాదిరెడ్డి, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ రవిశం కర్ రెడ్డి, జిల్లా నాయకులు పద్మాకర్, జబివుల్లా ప్రాంతీ య విద్యా సంచాలకులుకు కలిసి వినతి పత్రాన్ని అంద జేశారు, ఈ విషయమై ఆర్జేడీ స్పందిస్తూ ఎవరికి నష్టం లేకుండా ప్రమోషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయడా నికి కడప జిల్లా డిఈఓ తగు ఆదేశాలు జారీ చేశారు.

బి.మఠంలో ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆదేశాల మేరకు రాష్ట్ర అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలను తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత నమోదు కార్యక్రమం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి ఆదేశాలతో అభ్యర్థి నమోదు కార్యక్రమం తెలుగుదేశం పార్టీ నాయకులు, పూజ శివ యాదవ్ ఆధ్వర్యంలో, చేపట్టారు. మద్దిరెడ్డిపల్లి యాదవ నగర్, జింక నగర్, కక్కయ్య నగర్, పోలేరమ్మ నగర్ గ్రామాలలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పూజ శివ మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు మండలంలో అన్ని గ్రామాలలో తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు.

వివాహ, శుభకార్యాలకు కేరాఫ్

శ్రీరంగనాథ స్వామి ఏ.సీ కళ్యాణ మండపం

ప్రొప్రేటర్: అందే జగన్మోహన్ రెడ్డి

ఎస్.ఆర్.ఎస్ కన్వెన్షన్ హాల్

విశాలాంధ్ర - జమ్మలమడుగు : జమ్మలమడుగు పట్టణంలోని కోవెలకుంట్ల రోడ్డులో ఉన్న ఎస్.ఆర్.ఎస్ కన్వెన్షన్ హాల్ ఎంతో విశాలమైనది. వివాహ,శుభకార్యాలకు జమ్మలమడుగు పరిసర ప్రాంత ప్రజలకు రంగనాథ స్వామి ఏ.సీ కళ్యాణ మండపం ఎంతో అనువైనది. ఎస్.ఆర్.ఎస్ కన్వెన్షన్ హాల్ ఏ.సి ఏర్పాటు కాకముందు జమ్మలమడుగు ప్రాంత ప్రజలు ఇతర పట్టణ ప్రాంతాల్లో వివాహ, శుభకార్యాలు ఏర్పాటు చేసుకునేందుకు ఎన్నో వెయ్యిప్రయాసలకు గురయ్యేవారు. జమ్మలమడుగు ప్రాంత ప్రజలకు అన్ని వసతులతో ఒక ఏ.సీ కన్వెన్షన్ హాల్ ఏర్పాటు చేయాలని అందే జగన్మోహన్ రెడ్డి తలచారు. జమ్మలమడుగు లోని కోవెలకుంట్ల రోడ్డు నందు అన్ని హంగులతో, వసతులతో శ్రీ రంగనాథ స్వామి ఏ.సీ కళ్యాణ మండపం ఏర్పాటు చేశారు. కళ్యాణ మండపం ఏర్పాటు చేసిన కొద్ది కాలంలోనే ఎంతో ప్రసిద్ధి చెందింది. ప్రత్యేకతలు: కళ్యాణ మండపంలో వివాహ, శుభకార్యాలు చేసుకునే వారికోసం ప్రత్యేకంగా సెంట్రల్ ఏ.సీ సౌకర్యం కల్పించారు. పెళ్లికూతురు, పెళ్లి కొడుకు విడివిడిగా ఏ.సీ రూములు కలవు. విశాలమైన డైనింగ్ హాల్ కలదు. మంచి గ్రీనరీ గెస్ట్ రూములు అందుబాటులో ఉన్నాయి. వంట పాత్రల సౌకర్యం కలదు. అలాగే రంగ నాథ స్వామి కళ్యాణ మండపం ఆవరణ ప్రాంతం మనసు కు ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంటుంది. వివాహ శుభకార్యాలకు ఎంతో విశాలమైన ఫంక్షన్ హాల్ కలదు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా జనరేటర్ సౌకర్యం ఏర్పాటు చేశారు. వివాహ శుభకార్యా లకు వచ్చే వారికోసం విశాలమైన పార్కింగ్ సౌకర్యం కలదు. ఈ ఎస్.ఆర్.ఎస్ కన్వెన్షన్ హాల్లో వివాహ,శుభకార్యాలు జరుపుకునే వారికోసం రీజనబుల్ రేట్లు తో అందుబాటులో ఉన్నాయని జగన్మోహన్ రెడ్డి తెలిపారు.

రైతులను వంచించిన ఎన్డీఏ

కర్షకులకు పెట్టుబడి సాయం కరువు: మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-యర్రగుంట్ల : రైతాంగానికి మేలు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తోందని స్థానిక మాజీ ఎమ్మెల్యే డా.సుధీర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఏర్పాటై ఐదు మాసాలు గడిచినా ఇప్పటి వరకు భూ సర్వే సమస్యలను, ఇతరత్రా వాటిని పరిష్కరించలేదని ఆయన గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం కర్షకులకు పెట్టుబడి సాయాన్ని విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తనవంతు మొత్తాన్ని ఖాతాల్లో జమ చేయకపోవడం దారుణమన్నారు. రూ. 20వేలు ఏడాదికి కర్షకులకు పెట్టుబడి సాయం కింద అందిస్తామని ఇచ్చిన ఎన్నికల హామీని నేటికీ అమలు చేయకపోవడం అన్యాయమని ఆయన మండిపడ్డారు. ప్రస్తుత రబీ సీజన్‌లో ప్రభుత్వం నాణ్యతలేని బుడ్డశనగ విత్తనాలను సబ్సిడీ పేరుతో అందించి రైతుల నడ్డి విరిచారని ఆయన ధ్వజమెత్తారు. ఈ విత్తనాలు సక్రమంగా మొలకెత్తలేదని ఆయన గుర్తుచేశారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే మండల పరిధిలోని నిడిజువ్వి గ్రామంలో మంగళవారం జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఓ వినతిపత్రాన్ని మండల డిప్యూటీ తాహసీల్దార్ యామినికి అందజేశారు.

పుల్లూరు గ్రామంలో మెడికల్ క్యాంపుకు విశేష స్పందన

విశాలాంధ్ర - ఖాజీపేట : ఖాజీపేట మండల పరిధిలో గల కొత్త పుల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపు కు విశేష స్పందన లబించిందని శ్రీ వెంకటలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూన ఈశ్వర్ రెడ్డి తెలిపారు. శ్రీ వెంకటలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం కొత్త పుల్లూరు గ్రామం నందు మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో ఖాజీపేట మండల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఆరోగ్యాలను, కంటి చూపులను పరీక్షించుకొని ఉచితంగా మందులను పొంది సంతోషం వ్యక్తం చేశారని ట్రస్ట్ చైర్మన్ కూన ఈశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మెగా మెడికల్ క్యాంప్ నందు కడప నగరానికి చెందిన అక్షయా హాస్పిటల్, పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో డాక్టర్.వినయ్ ,డాక్టర్.వైఎస్ఎస్‌రెడ్డి పాల్గొని ప్రజల ఆరోగ్యాన్ని పరీక్షించారు. ప్రజల ఆయురారోగ్యాల పై శ్రద్ధ చూపుతూ ఇటువంటి మెడికల్ క్యాంపు లు ఎన్నో నిర్వహిస్తున్న శ్రీ వెంకటలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూన ఈశ్వర్ రెడ్డికి,అలాగే ట్రస్టు సభ్యులకు మెడికల్ క్యాంపులో ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గంగిరెడ్డి అంకి రెడ్డి (మాజీ సర్పంచ్), కొట్టూరు భారవి (న్యాయవాది), పుష్పగిరి ధర్మ పరిరక్షణ సేవాసమితి అధ్యక్షులు ఆవుల బసిరెడ్డి,శ్రీ వెంకటలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూన ఈశ్వర్ రెడ్డి, మెంబర్లు రామసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, ఓబులేసు, సుమలత,సుజాత తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ క్రీడలకు ఎంపికైన బీరం విద్యార్థి

విశాలాంధ్ర - ఖాజీపేట : ఆంధ్రప్రదేశ్,అనకాపల్లి జిల్లా, నక్కపల్లి లో జరిగిన ఎస్‌జిఎఫ్-68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన హాకీ పోటీలలో కడప జిల్లా, ఖాజీపేట మండలం, బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాల విద్యార్థి అయిన డి చేతన్ ప్రతిష్ట్ కడప జిల్లా తరపున పాల్గొని,రాష్ట్రస్థాయిలో పాల్గొని, జాతీయస్థాయి హాకీ క్రీడలకు ఎంపికయ్యాడు.ఈ సందర్భంగా కడప జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు మరియు బీరం శ్రీధర్ రెడ్డి విద్యా సంస్థల అధినేత బీరం సుబ్బారెడ్డి విద్యార్థిని అభినందిస్తూ యుద్ధం ఎంత కష్టమో విజయం అంత మధురంగా ఉంటుంది అని బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాల విద్యార్థి డి చేతన్ ప్రతిష్ట్ నిరూపించాడన్నారు. చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో హాకీ క్రీడల్లో పాల్గొంటున్నందుకు విద్యార్థిని, మరియు వ్యాయామ ఉపాధ్యాయుడు శివప్రసాద్ , విద్యార్థి తల్లిదండ్రులను అభినందించారు.బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాల విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా ఎప్పుడు వంద లో ఒకరిగా కాదు,వందకి ఒకరిగా ఉంటారు. అని అన్నారు క్రీడలకు తమ పాఠశాలలో ఎంతో ప్రాముఖ్యత నిచ్చి,విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికి తీసి వారు ఏ రంగంలో రాణించగలరో దానికి విద్యార్థులను సంసిద్ధం చేయడమే మా ధ్యేయమన్నారు. క్రీడల పట్ల ఎక్కువ ఆసక్తి ఉన్నటువంటి విద్యార్థులకు బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాలలో చేరితే వారు క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీరం శ్రీధర్ రెడ్డి విద్యాసంస్థల డైరెక్టర్ బీరం స్వాతి శ్రీకాంత్ , పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమ చందర్, వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

రెవిన్యూ అధికారిగా బాధ్యతలు చేపట్టిన విశ్వేశ్వర నాయుడు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కడప జిల్లా నూతన జిల్లా రెవిన్యూ అధికారిగా యం. విశ్వేశ్వర నాయుడు మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని తన ఛాంబర్లో డిఆర్వోగా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జేసి అదితి సింగ్ ఆదేశాలు, సూచనల మేరకు, ప్రజా ప్రతి నిధులు, అధికారుల సహకారంతో .. పారదర్శకంగా విధులను నిర్వర్తిస్తామన్నారు. అంతకు ముందు మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి గారిని కలిసి బొకేను అందించారు. 1995 బ్యాచ్ లో ప్రొబేషనరీ డిప్యూటీ తహశీల్దార్ గా విధులలో చేరినప్పటినుంచి వివిధ హోదాల్లో, వివిధ జిల్లాల్లో పనిచేస్తూ ఏపీసీఆర్డీఏ లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా పనిచేస్తూ ప్రస్తుతం డిఆర్వో గా ఇక్కడకు రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు, సిబ్బంది కలిసి తమ శుభాకాంక్షలను తెలియచేశారు.

రేపటి నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం నుంచి వారం రోజుల పాటు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి అమీరుద్దీన్ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మొదటిరోజు బాలల దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకావిష్కరణతో వారోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం పుస్తకప్రదర్శన, చెస్, క్విజ్ పోటీలు నిర్వహిస్తారని బహుబాషా కవి సమ్మేళనం, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళా సాధికారతపై అఘాయి త్యాలపై సెమినార్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా అధికారులు, ఎమ్మెల్యే, ఎంపీలతో బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాల యంలో పాఠకులకు వివిధ రూపాల్లో సేవలు దిస్తున్నామని గ్రంథాలయ వారోత్స వాలను విజయవంతంగా పూర్తి చేస్తామన్నారు.

నాయి బ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : నాయి బ్రాహ్మణ వాయిద్య వృత్తి కళాకారుల సంఘం జమ్మల మడుగు నియోజ కవర్గ అధ్యక్షులుగా మోపూరి రాము కార్యదర్శిగా రామ్ గోపాల్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నాయి బ్రాహ్మణ కళాకా రుల అధ్యక్షులు ఎగువగడ్డ రంగయ్య ఆధ్వర్యంలో జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ కులం బీసీలలో ఎనుకబడిన కులం గా ఉన్నప్పటికీ ఎన్నో పోరాటాలు చేస్తూనే ఉన్నామని వారు తెలిపారు.ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి మాట ఇవ్వడమే కాకుండా మా నాయి బ్రాహ్మణులకు పాలకొండ దేవస్థానంలో ధర్మకర్తగా అవకాశం ఇచ్చారని మా ప్రాంతంలో నివసించే రోశయ్యకు అనారోగ్యంగా ఉండడంతో ఒక లక్ష 24 వేల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ అందిం చారని తెలిపారు అనంతరం నాయి బ్రాహ్మణ జమ్ములమడుగు నియోజకవర్గ అధ్యక్షులు మోపూరి రాము మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అన్నారు. కార్యక్రమం లో సంక్షేమ సంఘం అధ్యక్షులు పత్తూరు గురు స్వామి, పందిళ్ళ పల్లె చెన్నప్ప, గుర్రంపాటి వెంకటరత్నం, కోటపాటి రమణ, పుత్త వెంకటసుబ్బయ్య, పాల్గొన్నారు.

మార్చి 30కి గృహ నిర్మాణాలు పూర్తి: పిడి

విశాలాంధ్ర-యర్రగుంట్ల : పురపాలిక పరిధి లోని ప్రభుత్వ లేఅవుట్‌లో అసంపూర్తిగా మిగిలి ఉన్న పక్కా గృహాలు వచ్చే ఏడాది మార్చి 30 నాటికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖప్రాజెక్టు డైరెక్టర్ రాజారత్నం సూచించారు.మంగళవారం ఆయన స్థానిక అధికారులతో కలిసి నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలిం చారు. లబ్దిదారులు పనుల పూర్తికి ఉత్సాహం చూపడం ద్వారా సొంతింటి కలను సాకారం చేసుకోవాలన్నారు. నిర్మాణం పనుల్లో భాగంగా కీరింగ్ పనులు సక్రమంగా చేసుకోవాలని ఆయన లబ్దిదారుల కు సూచించారు. బిల్లుల మంజూరులో అధికారులు త్వరితగతి న చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను లబ్దిదారులు పీడీ దృష్టికి తెచ్చారు. ఈకార్యక్రమం లో హౌసింగ్ ఏఈ రామకృష్ణ, మున్సిపల్ కమీషనర్ శేషఫణి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు బాష, అంకయ్య పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్

విశాలాంధ్ర -రాజంపేట: రాజంపేట పట్టణ కేంద్రంలో ప్రధాన రహదారిలో ఉన్న ఎస్ఎం మీసేవా ఆన్లైన్ సర్వీస్ కేంద్రాన్ని మంగళవారం రాజంపేట తహసిల్దార్ మున్ని, ఎస్సై నాగేశ్వరావు, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మీసేవ కేంద్రం నిర్వాహకులు ఆధార్లో మార్పులు, చేర్పుల కొరకు డబ్బు డిమాండ్ చేస్తున్నాడని విద్యార్థులు ఆరోపణలు చేయడంతో తహసిల్దార్ స్పందించారు. మీసేవ కేంద్రంపై ఫిర్యాదు రావడంతో గత కొన్ని రోజులుగా కేంద్రాన్ని మూసి వేయడంతో రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది సమక్షంలో తాళాలు పగలగొట్టి మీసేవ కేంద్రాన్ని పరిశీలించారు. అందులో ఉన్న పలు రికార్డులను పరిశీలించి వాటిని సీజ్ చేశారు. వీటిపై తాసిల్దార్ వివరణ త్వరగా వీటిపై క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత మీసేవ కేంద్రంలో జరిగిన అవినీతి ఆరోపణలపై సమీక్షించి సమగ్ర విచారణ చేసి వివరాలు తెలుపుతామని ఆమె పేర్కొన్నారు. మీసేవ కేంద్రాన్ని పరిశీలించిన వారిలో ఆర్ ఐ శేషం రాజు, ఏఎస్ఐ వర్మ, వీఆర్వో రాజు తదితరులు ఉన్నారు.

రాజంపేటలో జోరుగా సాగుతున్న టిడిపి సభ్యత్వాలు

విశాలాంధ్ర -రాజంపేట: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు కార్యకర్తలకు బంపరాఫర్ ఇవ్వడంతో రాజంపేట నియోజకవర్గంలో పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయ శేఖర్ రెడ్డి, అసెంబ్లీ అభ్యర్థిగా పోటీలో నిలిచిన సుగవాసి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యం లో రాజంపేట నియోజకవర్గంలో జోరుగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిరోజు పండుగ వాతావర ణంలో నిర్వహిస్తున్నారు. ఈ నెల 26 నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టిడిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రారంభించారు. ప్రధా నంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నలుగురు ఓటర్లలో ఒకర్ని సభ్యులుగా చేర్పించాలనే లక్ష్యంగా పెట్టుకోవాలని నేతలకు సూచించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది నుంచి కొత్తగా జీవితకాల సభ్యత్వాన్ని ప్రవేశపెడు తున్నామని గుర్తు చేశారు. దీని కోసం రూ.లక్ష రుసుంగా నిర్ణయించారు. ఒకవేళ పార్టీ సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే ఇచ్చే బీమా మొత్తాన్ని రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచడంతోపాటు చనిపోయిన కార్యకర్తల అంత్యక్రియలకు రూ. 10 వేలు చొప్పున తక్షణ సాయం అందిస్తామని భరోసా కల్పించడంతో రాజంపేటలో జోరుగా సభ్యత్వాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలోనే రాజంపేట మొన్నటి వరకు రెండవ స్థానంలో ఉండడం విశేషం. ఇప్పటి వరకు నియోజకవర్గంలో సుమారు 25 వేలు వరకు సభ్యత్వాలు నమోదు అయినట్లు తెలుస్తోంది. ప్రతి గ్రామంలో, ప్రతి మండలంలో ప్రతిరోజు సభ్యత్వ నమోదు కార్యక్రమం ఒక పండుగ వాతావరణంలో కొనసాగుతోంది. ఇదే స్ఫూర్తితో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగితే రానున్న రోజుల్లో లక్షకు పైగా సభ్యత్వాలు నమోదు అవుతాయని పసుపు శ్రేణులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనాప్పటికీ ఈసారి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఒక్కసారిగా ప్రజలు పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమాలలో పాల్గొనడం విశేషం.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయండి

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి: 2024 25 విద్యా సంవత్సరం సంబంధించిన పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు హెచ్ డబ్ల్యు ఓ లు కృషి చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జయప్రకాష్ పేర్కొన్నారు.మంగళవారం ఎస్సీ బాలుర హాస్టలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అందిస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించాలన్నారు. ఎస్సీ వన్, టు, వసతిగృహాలలో విద్యార్థుల కోసం ప్రత్యేక ట్యూటర్లు ఏర్పాటు చేశామని ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి వందశాతం ఫలితాల కోసం కృషి చేస్తామన్నారు. జిల్లాలో నాడు, నేడు కింద 24 వసతి గృహాలు మంజూర య్యాయని నిధులు లేక ఆగిపోయాయని ఆయన అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో నిధులు ఇస్తే ఇబ్బంది లుగా ఉన్న వసతి గృహాలు రిపేర్లు చేయిస్తామన్నారు.ఈ సమావేశంలో హెచ్ డబ్ల్యు ఓ లు రమేష్ బాబు, శ్రీనివాసులు, సావిత్రి,పాల్గొన్నారు.

..నాణ్యతతో పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి) చేసుకొని పురోగతి సాధించాలన్నారు. సమీక్ష అనంత రం పుల్లంపేట మండలం, దేవసముద్రం గ్రామం నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఒక భూ సమస్య పరిష్కారం కోసం రాజంపేట ఇన్చార్జి ఆర్ డి ఓ, పుల్లంపేట తాసిల్దార్లతో కలిసి సమస్య క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు.ఈ సమీక్ష సమావేశాలలో రాజంపేట ఇన్చార్జి ఆర్డీవో లీలారాణి, పుల్లంపేట మరియు ఓబులవారి పల్లి మండలాల తాసిల్దార్లు, ఎంపీడీవోలు, భూ సర్వే శాఖ ఏడి భరత్,వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు..

8వ తరగతి విద్యార్థిని చితక బాదిన ఉపాధ్యాయుడు

విశాలాంధ్ర -సుండుపల్లె: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో దిగువ గుల్లా వాండ్లపల్లికు చెందిన విగ్నేష్ అనే విద్యార్థి ఎనిమిదో తరగతి చదు వు తున్నాడు. అదే పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న లోకేష్ మంగళవారం తరగతి గదిలో చితక బాధడంతో విద్యార్థి స్పృహ కోల్పోయడు విషయం తెలుసుకున్న విద్యార్థి విగ్నేష్ తల్లిదండ్రులు పాఠశాల దగ్గరికి వచ్చి ఆందోళనకు దిగారు ఉపాధ్యాయుల నుంచి సరైన సమాధానం రాక పోవడంతో ధర్నాకు దిగారు ఎందుకు కొట్టారని తల్లి దండ్రులు ప్రశ్నిస్తే మీకు దిక్కున్నచోట చెప్పుకోండని సంఘటన స్థలం నుంచి ఉపాధ్యాయుడు పరారైనట్లు విద్యార్థి తల్లిదండ్రు లు తెలిపారు.ఈ సంఘటనను తప్పుదారి పట్టించే దుకు సహచర ఉపాధ్యాయులు పుష్ప ప్రయత్నం చేస్తు న్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని భీష్మించుకొని గ్రామస్తులు బయట ఇచ్చారు. తక్షణమే సంబంధిత అధికారులు సుండుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు లోకేష్ పై చర్యలు తీసుకోవాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి వెంకటేష్ నాయక్ ను వివరణ కోరగా జిల్లా డిప్యూటీ విద్యాశాఖ అధికారికి ఘటనపై సమాచారం చేరవేయడం జరిగిందని డీఈవో ఆదేశాల మేరకు నేడు ఉపాధ్యాయుడికి షోకాజు నోటీసు జారీ చేస్తామన్నారు. బుధవారం ఉదయం పాఠశాలలో విచారణ చేపట్టి కఠిన చర్యలు చేపడతామన్నారు.

ఆంధ్ర కళాదర్శని పుస్తకంలో వైవీయూ అధ్యాపకుడు చిత్రాలు



విశాలాంధ్ర-కడప వైవీయూ : "ఆంధ్ర కళా దర్శని" అనే పేరుతో ఆర్ట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ పుస్తక ఘప్రచురణలో యోగివేమన యూనివర్సిటీ లలిత కళల విభాగ అధ్యాపకులు భైరవ పోగు ఈరప్ప చిత్రాలు ప్రచురణ అయ్యాయి. 64 కళలు డాట్ కామ్ డైరెక్టర్ ఎల్లపు కళాసాగర్ నేతృత్వంలో సంకలనం చేసిన ఆర్ట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చిత్రకారుల డైరీ ఆవిష్కరణ జరిగింది. విజయవాడ వేదికగా ఆవిష్కరించిన ఆర్ట్ అఫ్ ఆంధ్ర ప్రదేశ్ లో దాదాపు 300 మంది చిత్ర,శిల్ప, హస్త కళాకారుల సమగ్ర వివరాలను పొందుపరచడం జరిగిందన్నారు. ఈ పుస్తక లలిత కళల విభాగం అధిపతి డాక్టర్ కె మృత్యుంజయ రావు ఎడిటోరియల్ మెంబర్ గా వ్యవ హరించారు.ఈ సందర్భం గా మండలి బుద్ధ ప్రసాద్ మాజీ ఉపసభాపతి, పద్మశ్రీ అవార్డు గ్రహీత సీవీ రాజు శాలువాతో ఈరప్ప ను సత్క రించి పుస్తకం అందచేశారు, ఉపకులపతి కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పుత్తా పద్మ, ప్రిన్సిపాల్ ప్రొ,, రఘునాథ్ రెడ్డి విభాగ అధిపతి డాక్టర్ కె మృత్యుంజయరావు మరియు ఇతర అధ్యాపక సిబ్బంది ఈరప్ప ను అభినందించారు. కర్నూలుకు చెందిన ఈరప్ప లలిత కళల విభాగ అధ్యాపకులుగా పనిచేస్తున్నారు.

వేతన సవరణకై వినతి

విశాలాంధ్ర-యర్రగుంట్ల : సిమెంటు రంగ కాంట్రాక్టు కార్మికుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం విజయ వాడలోని రాష్ట్ర సచివా లయంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు వేతన సవరణకై వినతిపత్రం సమర్పించారు. ఏఐటీ సీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య, జిల్లా కన్వీనర్ ఎంవి సుబ్బారెడ్డి స్థానిక ఐసీఎల్ సిమెంటు పరిశ్రమ కార్మికు లు షరీఫ్, మురళీ, గురప్ప తదితరులు ఈ మేరకు మంత్రిని కలిసి వినతి చేశారు. కనీస వేతనాల జీవో ఎంఎస్ నెంబర్ 11 గత 13 సంవత్సరాల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో విడు దల చేశారని అప్పటి నుంచి ఇప్పటి వరకు జీవోను సవరిం చని కారణంగా కార్మికులు ప్రస్తుత ధరలకు అనుగుణంగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని గుర్తుచేశారు. జీవో నెంబర్ 11ను సవ రించి కార్మికులకు న్యాయం చేయాలని మంత్రిని కోరారు.

నేడు వరసిద్ధి వినాయక స్వామి విగ్రహప్రతిష్ఠ

విశాలాంధ్ర -సుండుపల్లె: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి విగ్రహప్రతిష్ఠ మహోత్సవము సందర్భంగా మంగళవారం మండలంలోని మాచిరెడ్డిగారిపల్లి పంచాయ తీ కటారుమడుకులో సాయంత్రం అంగరంగ వైభవముగ డప్పు వాయిద్యములు, మేళతాళ ములతో, బాణసంచాతో స్వామివార్ల ఊరేగిం పు నిర్వహించారు. బుధవారం ఉదయం 9:30 గంటల నుండి 11:00 గంటల మధ్య శుభ ధనుర్ లగ్న మందు శ్రీ మహాగణపతి మరియు శ్రీ సుబ్రమణ్య స్వామి, అయ్యప్ప స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠాపన, మహాపూర్ణా హుతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. హాజరైన భక్తులకు అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు.

జగన్మోహన్ రెడ్డిని కలిసిన పాక సురేష్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి నీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ 47 వ డివిజన్ కార్పొరేటర్ పాక సురేష్ మంగళ వారం తాడేపల్లి లోని ఆయన నివాసంలో కలిశామని తెలిపారు. కడప నియోజక వర్గం లో పలు డివిజన్ లలో ప్రజలు పడుతున్న సమస్యల ను అయన దృష్టికి తీసుకోని వచ్చా మ్మనారు. కూటమీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అనేక సమ స్యలు ప్రజలు ఎదురు కొంటున్నట్లు తెలియ జేసమ్మనారు. ముఖ్యం గా, అక్కయ్యపల్లి, చెమ్ముమ్మిపేట, రామ రాజపల్లి, అలంకాన్ పల్లి, పాలంపల్లి, దేవుని కడప లలో పలు సమస్యలను అయన దృష్టికి తీసుకెళ్లామ న్నారు. జగన్మోహన్ రెడ్డి స్పం దించి కడప పార్టీ నేతలతో, జిల్లా అధ్యక్షుడు తో సమనయవ్యం చేసుకొని పోవాలని సూచిం చారన్నారు. కలిసిన వారిలో కార్పొరే టర్లు, బాల స్వామి రెడ్డి, రెడ్డి వరకుమార్, మధు సుధన్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి కలిసిన వారిలో ఉన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని నెహ్రూ రోడ్డులో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంద్యాల వరద రాజుల రెడ్డి జన్మదిన వేడుకలను మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా కేక్‌ను కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా నియోజకవర్గంలోని ప్రజలందరికి నిత్యం అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి నిండు నూరేళ్లు ఆయురాయోగ్యాలతో ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలన్నారు.

అన్నదానం : ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పుట్టిన రోజు సంధర్భంగా స్థానిక విజయేశ్వరి వృద్ధాశ్రమం నందు ఆయన అభిమాని ఖాజా అన్నదానాన్ని నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యే, పెద్దాయన వరదరాజుల రెడ్డి ప్రజా జీవితంలో ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

మండల విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి

డీఈఓకు విధ్యార్థి యువజన ప్రజాసంఘాల వినతి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పట్టణంలోని డిప్యూటి డీఈఓ కార్యాలయం నందు ఎంఈఓల, హెచ్‌ఎంల మీటింక్‌కు హాజరైన కడప జిల్లా డీఈఓ, ప్రొద్దుటూరు డిప్యూటి డీఈఓ ఇన్చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్న మీనాక్షికు విధ్యార్ధి యువజన ప్రజా సంఘాల నాయకులు ఓబులేసు కత్తి, గడ్డం నరసింహులు,ముళపాక ప్రతాప్ రెడ్డి, బయన్న, మహిళా అధ్యక్షురాలు చెన్నమ్మ మాదిగలు వినతిపత్రం అందజేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంలో విద్యను వ్యాపారం చేస్తూ అనేక విద్యా సంస్థలు నిర్వహిస్తున్నారని అలాగే ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోకుండా ప్రభుత్వ పాఠశాలల నందు నాడు-నేడు పనులలో అనేక అక్రమాలు జరిగాయని కొన్ని పాఠశాలలు పిల్లర్ల స్ధాయిలోనే ఆగిపోయాయన్నారు. ఇటువంటి సంఘటనలు చాపాడు, దువ్వూరు, పులివెందుల మండలాల్లో ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. అలాగే పులివెందుల పట్టణంలో అంకాలమ్మ పేట పాఠశాల హెచ్‌ఎంగా కొనసాగుతున్న మంజుల, చిట్టి బాబులు తప్పుడు కుల సర్టిఫికెట్‌తో ఎస్సీ కోటాలో ఉద్యోగం పొందడం జరిగిందని ఇలాంటి తప్పుడు ఉద్యోగస్థులపై నిఘా ఉంచాల్సిన పులివెందుల ఎంఈఓలు ఆయనకు వత్తాసు పలుకుతూ ఆయనకు కొమ్ముకాయడం దారుణం అన్నారు. తక్షణమే ప్రొద్దుటూరు పట్టణానికి రెగ్యులర్ సీసీని నియమించాలని స్టాఫ్ కొరత లేకుండా చూడాలని విధ్యార్థి ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో విధ్యార్ధి యువజన ప్రజాసంఘాల నాయకులు బెనర్జీ, ఏసుదాసు, రాజు, బాష తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో దుప్పట్లు, పండ్లు పంపిణీ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి జన్మదినం సంధర్భంగా దొరసాని పల్లె బైపాస్ రోడ్డులోని(రైల్వే స్టేషన్ దగ్గర) వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమం నందు చౌటపల్లె మాజీ సర్పంచ్ మార్తల లక్ష్మిరెడ్డి కేక్ కట్ చేసి వృద్ధులకు దుప్పట్లను, పండ్లను పంపిణీ చేశారు. ప్రజా జీవితంలో పెద్దయన వరదరాజుల రెడ్డి మరెన్నో పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గురిజాల రామచంద్రారెడ్డి, అరవ మునివర, బచ్చు నాగార్జున రెడ్డి, మండాది రాజశేఖర్ రెడ్డి, మార్తల శ్రీకాంత్ రెడ్డి, శివ, చంద్రాయుడు, వరద సుధాకర్, ఆవుల సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు, సాధు ప్రసాద్, పాతకోట ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థి మృతిపై ఎన్నో అనుమానాలు - పౌర హక్కుల సంఘం

విశాలాంధ్ర - పీలేరు : అన్నమయ్య జిల్లా కె.వి పల్లి మండలం గ్యారంపల్లె గురుకుల పాఠశాలలో చదువు చున్న రెడ్డి మోక్షిత్ మృతిపై ఎన్నో అనుమానాలు ఉన్నాయి. వాటిని నివృత్తి చేయాల్సింది పోలీసులేనని పౌర హక్కుల సంఘం తెలిపింది. ఈ నెల 10 న గ్యారంపల్లి గురుకుల పాఠశాలలో ఉదయం 8:30 లోపు జరిగిన విద్యార్థి రెడ్డి మోక్షిత్ మృతి సంఘటనపై పౌర హక్కుల సంఘం ఉమ్మడి కడప జిల్లా కమిటీ జరిగిన సంఘటన ప్రాంతాన్ని, స్కూలు సిబ్బంది నీ, విద్యార్థి తల్లిదండ్రులను,పోస్ట్ మార్టం చేసిన డాక్టర్ ను కెవి పల్లె పోలీసు వారిని, కలసి సేకరించిన వారు తెలిపిన వాస్తవ వివరాలు ఇలా ఉన్నాయి....ఈ నెల 10న ఉదయం పాఠశాల డార్మెంటరీలో విద్యార్థులందరూ అల్పాహారం కోసం మెస్ కి వెళ్ళిన సందర్భంలో ఐదో తరగతికి సంబంధించిన డార్మిటరీలో ఉన్న రెడ్డి మోక్షిత్ తన నాలుగు అడుగుల ఎత్తు ఉన్న డబల్ డెక్కర్ మంచానికి టవల్తో ఉరి వేసుకున్నాడు. కొందరు విద్యార్థులు చూసి ఉపాధ్యాయులకు చెప్పగా ఉపాధ్యాయులు వచ్చి చూడగా అప్పటికే పిల్లవాడు అపస్మారక స్థితిలో ఉన్నాడని అతనిని రక్షించేందుకు వార్డను మరికొంతమంది ఉపాధ్యాయులు పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే పిల్లవాడు చనిపోయాడని డాక్టర్లు ధ్రువీకరించారని ఉపాధ్యాయులు మా కమిటీ దృష్టికి తెచ్చారు. సంఘటన జరిగిన ముందటి రోజు సెటిల్ బ్యాట్ విషయమై తన సహ విద్యార్థితో వాదన జరిగిందని విద్యార్థులు మా దృష్టికి తీసుకొచ్చారు. బ్యాట్ విరిగిన దానికి పరిహారంగా సహ విద్యార్థి రూ.300 ఇమ్మన్నాడని దానికి తన వద్ద ఉన్న 100 ఇచ్చాడని మిగతా రూ.200 మా అమ్మ వచ్చిన వెంటనే ఇస్తానని చెప్పాడని తెలుస్తున్నది ,కానీ పిల్లలు గానీ ఉపాధ్యాయులు గాని రెడ్డి మోక్షిత్ ఒక తెలివైన విద్యార్థి ఎవరితో ఎక్కువగా మాట్లాడే వాడు గాడని తన పని తను చూసుకునేవాడని చదువులో ముందుండేవాడని చెప్పారు. తల్లిదండ్రులు వాణి ,తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లులో నివాసం ఉన్న ప్రాంతంలో కలసి మాట్లాడడం కూడా జరిగినది. విద్యార్థి తల్లి కమిటీ దృష్టికి తెచ్చిన ఎన్నో అనుమానాలు ఉన్నాయన్నారు. నా కుమారుని మృతి వెనక ఎన్నో అనుమానాలు ఉన్నాయని ఆమె కమిటీ ముందు ఆవేదన వ్యక్తం చేసింది. ఉజ్వల భవిష్యత్తు కలిగిన విద్యార్థి మరణంతో కృంగిపోయిన పేద లైన రెడ్డి మోక్షిత్ తల్లిదండ్రులను ప్రభుత్వము ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము.. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీ వెంకటేశ్వర్లు ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి రాయచూర్ రవిశంకర్ జిల్లా ఉపాధ్యక్షులు పి రెడ్డయ్య జిల్లా సహాయ కార్యదర్శి ఎం రవిశంకర్ జిల్లా కార్యవర్గ సభ్యులు వంగిమల్ల రమణయ్య పాల్గొన్నారు.

చెత్తను తొలగించాలని ఆదేశించిన కమీషనర్

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: మడూరు కాలువలో చెత్తను తొలగించాలని మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున శానిటరీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం మడూరు కాలువలో పేరుకుపోయిన చెత్త చెదారాలను కమీషనర్ స్వయంగా పరిశీలించారు. ఈ సంధర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ బాషకు సిబ్బందితో చెత్తను తొలగించాలని ఆదేశించారు. అనంతరం రామేశ్వరం మోరీల వద్ద ఉన్న చెత్త పాయింట్లను సిబ్బందిచే తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ బాషా పాల్గొన్నారు.

14 నుండి 20వ తేది వరకు జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు



విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్ధానిక రామేశ్వరం బాల బాలికల గ్రంధాలయంలో ఈనెల 14వ తేది నుండి 20వ తేది వరకు 57వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంధాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్ తెలిపారు. ఈ సంధర్భం గా పాఠశాలల విద్యార్థులకు పద్య పఠనం, చిత్రలేఖణం, వ్యాస రచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు 20వ తేదిన బహుమ తులు ప్రధానం చేస్తామని ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను గ్రంధాలయంలో నమోదు చేసుకోవాలని తెలిపారు.

విద్యాభివృద్ధిలో విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలి

విశాలాంధ్ర- పీలేరు : విద్యాభివృద్ధిలో విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలని జిల్లా సాల్ట్ సాల్ట్ కోఆర్డినేటర్ చిన్న బ్రహ్మయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జరిగిన పీలేరు మండల ఉపాధ్యాయుల సమావేశంలో టీచర్ ప్రొఫిషన్సీ డోవలెప్మెంట్ కోర్సుతో రాష్ట్ర ఉపాధ్యాయ వృత్తిలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించాలని జిల్లా సాల్ట్ సాల్ట్ కోఆర్డినేటర్ చిన్న బ్రహ్మయ్య తెలియజేశారు. ప్రపంచ బ్యాంకు నిధుల ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన (సపోర్టింగ్ ఆంధ్ర లర్నింగ్ ట్రాన్స్ఫర్మేషన్) ద్వారా ఉపాధ్యాయ వృత్తిలో విద్యాభివృద్ధికి విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధించుటకు ఫిరికీ యాప్ ద్వారా గణితమునకు సంబంధించిన కొన్ని వీడియోల ద్వారా బోధనా పద్ధతిలో తగిన మార్పులు చేసుకోవాలని వాటిలో ఉన్న సమస్యలను తెలుసుకొని ఆ కోర్సును పూర్తి చేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఈ కోర్స్ లోని వీడియోలను చూసి వాటి ద్వారా విద్యార్థులకు నైపుణ్యాలను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు వై.లోకేశ్వర్ రెడ్డి బి పద్మావతమ్మ సీఆర్పిలు మురళీధర్ రాజు, నాగరాజ, అశోక్, మాధవి, కార్యాలయ సిబ్బం ది తాజూన్, శిరీష, టీపీడీకి ఎన్నికైన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విఎస్ఎన్ సిద్ధార్థ పాఠశాల విద్యార్థులదే హవా

విశాలాంధ్ర-పీలేరు : పీలేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో స్థానిక విఎస్ఎన్ సిద్దార్థ పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. పీలేరు లయన్స్ క్లబ్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన, ఎలక్యూషన్, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు జరిగాయి. ఈ కార్యక్రమంలో 18 పాఠశాలలు పాల్గొన్నాయి. వ్యాస రచనలో విఎస్ఎన్ సిద్దార్థ పాఠశాల సి. గిరీష్,, ప్రసంగంలో ఎ.చరణ్ కుమార్, క్విజ్ పోటీలలోప్రథమ స్థానం లో రాణించారు. డ్రాయింగులో శ్రీ భువన విద్యాలయ పాఠశాల విద్యార్థి పి. తౌసిక్ విజేతగా నిలిచారు. బహుమతులు గెలిచిన విద్యార్థులకు సుమారు 15000 ప్రైజ్ మనీతో పాటు సర్టిఫికెట్ ప్రధానం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ విఎస్ఎన్ ప్రసాద్, ప్రెసిడెంట్ మహేష్ గుప్తా, సెక్రటరీ చింతల విజయభాస్కర్ రెడ్డి, ట్రెజరర్ చెంగయ్య, ప్రోగ్రామ్ ఆర్గనైజర్ సుధాకర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, భానుమూర్తి, శశిధర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి ,సూర్యనారాయణ, ప్రభాకర్ రావు , మహేష్, అశోక్ కుమార్, బాలాంజనేయులు , లయన్స్ మెంబర్స్ పాల్గొన్నారు. అదే విధంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పిలేరు ఆర్య వైశ్య కళ్యాణమండపం నందు చిల్డ్రన్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఇండియన్ బీచ్ ట్రీ స్కూల్ విద్యర్థులు పాల్గొని ఎస్సే రైటింగ్ నందు పాల్గొని ప్రథమ బహుమతి సాధించారు.

కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి అంటే ఎందుకంత భయం.!

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి అంటే వైసిపి నాయకులు ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదని తెలుగుదేశం పార్టీ కడప నగర మైనారిటీ మహిళా కార్యదర్శి నౌజియా పర్వీన్, కృష్ణవేణిలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని మేకల దొడ్డి వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ డివిజన్ ఆఫీసులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ. ఇటీవల కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాధవి రెడ్డికి అవమానం జరిగేలా వైసీపీ నాయకులు పాల్పడ్డారని ఆమెకు ఇవ్వవలసిన సీటు కింద ఏర్పాటు చేయడం బాధాకర విషయమన్నారు. ఒక మహిళకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు గత వైసిపి ప్రభుత్వం లో ఇటు ఒక ఎమ్మెల్యే అటు ఒక ఎమ్మెల్యే కూర్చుని సమావేశాలు జరిపే వాళ్ళని ఇప్పుడు మహిళా అని చిన్న చూపు చూస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మా ఎమ్మెల్యే అభివృద్ధిపై మాట్లాడుతుంటే ఓర్చుకోలేని వైసీపీ వారు సభ నుండి వెళ్లిపోవడం ఎంత వరకు సబబు అన్నారు. ఎక్కడైనా ప్రజల కోసం పనిచేయాలి కానీ కక్షపూరిత పరిపాలన చేయకూడదని తెలిపారు. గత ప్రభుత్వంలో 10 సంవత్సరాలు పరిపాలించిన మైనారిటీలు మైనారిటీల సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు అధికారాన్ని అడ్డం పెట్టుకొని నగరపాలక సంస్థలో తిన్న ప్రతి రూపాయిని కక్కిస్తానంటూ చేసిన శబ్దానికి మేమంతా ఆమెకు అండగా ఉండి ఆమెతో పాటు నడిచి నగర అభివృద్ధికి తోడ్పడు తామని తెలిపారు. ఈ సమావేశంలో మహబూబ్ షాన్, శనియత్ తదితరులు పాల్గొన్నారు.

నీరులేక కౌండిన్య వెలవెల..!

విశాలాంధ్ర- రామసముద్రం : అన్నమయ్య జిల్లా మండలంలోని కౌండిన్య నది నీరు లేక వెల వెల పోతోంది. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు లేవు గడచిన ఐదు సంవత్సరాలలో ప్రభుత్వం నీటిపారుదల శాఖపై కన్నెత్తి చూడకపోవడం చెరువులకు కాలువలకు శాపంగా పరిణమించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు 2014 -19 తెలుగుదేశం ప్రభుత్వంలో నీరు చెట్టు పనుల ద్వారా చెరువు కట్టల బలోపేతం చెరువులలో పూడిక తీత పనులు చేయించింది. చెక్ డ్యాములు నిర్మించి వర్షపు నీరు నిల్వచేసి భూగర్భ జలాల పెంపుకు కృషిచేసింది కోట్లు ఖర్చు చేసి చెరువులు కుంటల ను సంరక్షణ చేసింది ప్రస్తుతం రామసముద్రం మండలంలోని కౌండిన్య నది చెట్లు పిచ్చి మొక్కలు మొలచి నీరు చేరకుండా నిల్వ లేకుండా పోయింది కౌండిన్యలోకి నీరు చేరే మార్గమే కరువైంది నాలుగు కిలోమీటర్ల మేర ఉన్న కౌండిన్య నది నీరు నిలవ వల్ల భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ తాగునీటి బోర్లు నీటి నిలువ పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నీటిపారుదల శాఖపై ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమర్థులైన కొరముట్లకు మాజీ సిఎం వద్ద మంచి గుర్తింపు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సమర్థులైన మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కు పులివెందుల శాసనసభ్యులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వద్ద మంచి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని వైసిపి నాయకులు దామర్ల శిద్దయ్య, డివి రమణ, సింగమాల వినోద్ కన్నా, గానుగపెంట సుధాకర్ తదితరులు కొనియాడారు. మంగళవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాటాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అబివృద్ధికి శ్రమిస్తూ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గుర్తించివైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎంపిక చేశారన్నారు. జగన్‌కు వైసిపి నాయకులు దామర్ల శిద్దయ్య, డివి రమణ, సింగమాల వినోద్ కన్నా, గానుగపెంట సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

18వ తేదీన సచివాలయాల వద్ద ఆందోళనలను జయప్రదం చేయండి - సీపీఐ

విశాలాంధ్ర - బద్వేలు : ఈనెల 18వ తేదీన సచివాలయాల వద్ద ఆందోళనలను జయప్రదం చేయాలని సీపీఐ బద్వేలు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్ణయించింది. సిపిఐ బద్వేల్ ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక జైవి భవనంలో ఇమ్మానుయేల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి వీరశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా నేడు అధికారంలో ఉన్న అధికార పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇల్లు లేని నిరుపేదలకు పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాలలో ముడు సెంట్లు ఇంటి స్థలముతో రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఇస్తానని చెప్పి నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీ మేరకు నేడు ఆ హామీని నెరవేర్చాలని దానితోపాటు పక్కా గృహాలు మంజూరు చేసి 5 లక్షల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాల పరిధిలో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం కోసం దరఖాస్తులు చేపించి 18వ తారీఖున సచివాలయం ముందు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇల్లు లేని నిరుపేదలందరూ దరఖాస్తు చేసుకోవాలనిపిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో ఇల్లు లేని నిరుపేదలకు జగనన్న కాలనీల పేరుతో ఇచ్చిన ఒక సెంటు స్థలం ఇల్ల నిర్మాణాలు నిరుపయోగంగా ఉన్నాయని ఇచ్చినా 1,80,000 సరిపోక అప్పు తెచ్చి కట్టుకున్న నిరుపేదలు అప్పు తిరిగి ఆ ఇంటిని అమ్మే పరిస్థితి వచ్చిందని కట్టినవి కూడా కాంట్రాక్టర్ చాలా నాశరికంగా కట్టాడని అవి సంసారం చేయడానికి అనుకూలంగా లేవని ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీని నెరవేర్చి పేదల కళ్ళల్లో ఆనందం

చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే అంతవరకు ఈ పోరాటాలు కొనసాగుతాయని అన్నారు. 18 వ తారీకు జరిగే సచివాలయాల వద్ద ఆందోళనను జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చాడు. ఈ కార్యక్రమంలో ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్. పట్టణ కార్యదర్శి పి బాలు. జిల్లా సమితి సభ్యులు పడిగా వెంకటరమణ. ఏరియా కార్యవర్గ సభ్యులు పెంచలయ్య. కలసపాడు మండల కార్యదర్శి సునీల్. గోపవరం వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఖాదర్ బాషాకార్యకర్తలు పాల్గొన్నారు.

ముక్కారూపానంద రెడ్డిని కలిసిన ఒంటిమిట్ట టీడీపీ నేతలు

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : రాజంపేట నియోజకవర్గం లోని ఒంటిమిట్ట మండలం టీడీపీ సీనియర్ నాయకులు అందరూ అన్నమయ్య అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ రైల్వే కోడూరు నియోజకవర్గం ఇంచార్జ్ ముక్క రూపానంద రెడ్డిని వారి సతీమణి ముక్క వరలక్ష్మిని మండల టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా ముక్క రూపానంద్ రెడ్డికి కలిసి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ వచ్చినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు,క్లాస్ వన్ కాంట్రాక్టర్ ఎస్వీ రమణ,యూనిట్ ఇన్చార్జ్ పత్తి సుబ్బరాయుడు, యువ నాయకుడు ముద్దా కృష్ణారెడ్డి, రోశయ్య,చంద్రమౌళి పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి మంచూరు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర -అట్లూరు: మండలం లోని ముత్తుకూరు గ్రామంలో గత పది రోజులక్రితం ఆవులు పోట్లాడు కుంటూ తొక్కిసలాటలో అదే గ్రామానికి చెందిన అమీర్ 55 సంవత్సరాల వయసు మృతి చెందిన విషయం తెలుసుకున్నారు. వారి కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి తన ముఖ్య అనుచరుడైన క్రియాశీల నాయకుడు రైల్వే కాంట్రాక్టర్ అరవ శ్రీనివాసులు రెడ్డి చేత పంపించి వారి కుటుంబాన్ని ఆదరించి ఆదుకున్నారు. అనంతరం ఫోన్‌లో మంచూరు సూర్యనారాయణ రెడ్డి పరామర్శించి వారి కుటుంబానికి ధైర్యం చెప్పి పార్టీ పరంగా మీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుప్పయ్య, వేములూరు యువ నాయకుడు గురు ప్రసాద్ రెడ్డి, సూరారెడ్డి, నరసింహారెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు అక్బర్ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో సంపద కేంద్రాలు ప్రస్తుత పరిస్థితి.!

విశాలాంధ్ర-పెద్దమండ్యెం : మండలంలో సిద్దవరం పంచాయతీ ని ఆదర్శ పంచాయతీ గా అభివృద్ధి పనులను గ్రామాలలో అమలు పరచడానికి మండలంలో ఒక గ్రామాన్ని మోడల్ పంచాయతీ గా ఎన్నుకున్నారు. దేనిలో భాగంగా గ్రామంలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం గురించి ప్రజలకు తెలియ చేయడానికి మరియు గ్రామాల్లో ఉన్న చెత్తతో సంపద కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రమాన్ని మండలంలో ఒక ఆదర్శ పంచాయతీ గా అభివృద్ధి చెందుతున్న ఆశభావంతో ఆగస్టు నెల 20 వా తేదీన మండలంలో ని అధికారులు మరియు సచివాలయ సిబ్బందితో మీటింగ్ ఏర్పాటు చేసి సక్రమంగా పంచాయితీ లో స్వచ్చత హి సేవకార్యక్రమం గురించి అందరికి తెలియచేసారు. కాని ఇన్ని నెలలు అయినా సచివాలయ సిబ్బంది ప్రస్థుతం ఫోటో చూస్తే అర్థం అవుతుంది. కనీసం సూచిక బోర్డ్ లు కూడా లేకుండా ముల్లా పొదలతో ఫర్శనం ఇసున్నాయి. అధికారులు, నాయకుల పని తీరు చాలా అధ్వాన్నంగా మారింది.

'అందరికీ క్యాన్సర్ పరీక్షలు' గోడపత్రాలు విడుదల

విశాలాంధ్ర-కడప : అందరికీ క్యాన్సర్ పరీక్షలు గోడపత్రాలను మంగళవారం విడుదల చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్.కే.నాగరాజు ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14న ప్రారంభం కానున్న ఎన్సీ డి 3.0 సర్వే కార్యక్రమముపై సమావేశం నిర్వహించారు. ఎన్సీడి 3.0 సర్వేలో భాగంగా ఎంఎల్ హెచ్పి (సిహెచ్ఓ),ఏ యన్ ఎం, ఆశల ద్వారా ప్రతి గృహంలో నివసిస్తున్న18 సంవత్సరాలు పైబడిన స్త్రీ ,పురుషులకు బీపీ, షుగరు, హిమోగ్లోబిన్, నోరు, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు, 30 సంవత్సరాలు పైబడి వివాహమైన స్త్రీలందరికీ గర్భాశయముఖ ద్వారా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆహారపు అలవాట్లతోనూ, ప్రస్తుతం వున్నజీవన శైలి విధానం వలన, శారీరక, మానసిక, సామాజిక ఒత్తిడిలతో, రక్తపోటు, షుగరు జబ్బులతో బాధపడుతున్నారు. 14న జిల్లాలోని అంగన్వాడి సెంటర్‌లోఉన్న పిల్లలకు, ప్రభుత్వ పాఠశాలలో ఉన్న విద్యార్థిని, విద్యార్థులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమా మహేశ్వర కుమార్ డి ఐ ఓ, డాక్టర్ శశి భూషణం రెడ్డి డిపిఎంఓ, డాక్టర్ రవి డియల్ ఏటిఓ, డాక్టర్ రమేష్ ఆర్బిఎస్‌కె అండ్ ఎన్సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్,జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సునీత, డాక్టర్ బాలా ఆంజనేయులు, డాక్టర్ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్, డాక్టర్ వెంకట చంద్రారెడ్డి డిఎస్ఓ,జిల్లా మలేరియా అధి కారి మనోరమ, భారతి డెమో, కుమారి హెచ్ ఈ, నవీన్ ఆర్బీ ఎస్కె ప్రోగ్రామ్ మేనేజర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట : టిడిపి నేత సూర్యనారాయణ రెడ్డి

విశాలాంధ్ర -అట్లూరు: రాష్ట్ర బడ్జెట్లో సంక్షేమానికి భారీ కేటాయింపులు జరిగాయని బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి అన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా మరో రెండు పథకాలైన అమ్మ ఒడి, ఉచిత బస్సు ప్రయాణం పథకానికి ఈ బడ్జెట్లో నిధులు కేటాయించడం సంతోషకర విషయమన్నారు. కూటమి ప్రభుత్వం ఆర్థిక సంవత్సరానికి 2.94 లక్షల కోట్లతో పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టడం అభివృద్ధికి పెద్దపీట వేసిందని తెలిపారు. గత ఐదేళ్లలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అంచుల్లోకి నెట్టిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి పునర్జీవం పోయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారించారన్నారు.

14 నుండి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - జమ్మలమడుగు : ఈనెల 14వ తేదీ నుండి 20 వరకు 57వ జాతీయ గ్రంథాలయ దినోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జమ్మలమడుగు ప్రభుత్వ శాఖ గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బండారు శ్రీనివాసులు తెలిపారు. గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా బాలల దినోత్సవం, పుస్తక ప్రదర్శన, జాతీయ ఉద్యమ నాయకుల సంస్మరణ, కవి సమ్మేళనం, క్విజ్, చిత్రలేఖనం, టాలెంట్ టెస్ట్ తదితర పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వారోత్సవాల్లో అధిక సంఖ్యలో పాఠకులు, ప్రజలు విద్యార్థులు విరివిగా పాల్గొనాలని కోరారు.

యువ ఉత్సవ్‌ను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-పులివెందుల: ప్రభుత్వం యువజన వ్యవహారా లు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యం లో ఈ నెల 16 న కడప యోగి వేమన యూనివర్సిటీ లో యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెఎన్‌టియు ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ కోరారు. స్థానిక జెఎన్‌టీ యులో యువ ఉత్సవ్ 2024 కార్యక్రమానికి సంబంధిం చిన గోడ పత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఆయన మా ట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇండి యా 2047 పోటీలు చిత్రలేఖనం, కవితా రచన, మొబైల్ ఫోటోగ్రఫీ, డిక్లమేషన్, సాంస్కృతిక ప్రదర్శనలు, సైన్స్ ఎగ్జిబిషన్ వంటి విభాగాలలో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకునే అవకాశముం టుంది. కావున 15 సంవత్సరాలు నిండిన యువత పోటీలలో పాల్గొని యువ ఉత్సవ్ పోటీలను విజ యవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో స్నేహితఅమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం: కాంగ్రెస్

విశాలాంధ్ర - జమ్మలమడుగు : జమ్మల మడుగు నియో జక వర్గ ప్రజల సమస్య లపై కాంగ్రెస్ పార్టీ తరపున నిరం తరం పోరాటం చేస్తామని కాంగ్రెస్ పార్టీ జమ్మల మడుగు నియోజకవర్గ సమన్వయకర్త సింగం శివమోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జమ్మల మడుగు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేక రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఆదేశాల తో నియోజకవర్గ బాధ్యతలు స్వీకరించడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పోలవరం పూర్తి చేసి ఉంటే రాష్ట్రం అభివృద్ధి జరిగేది అని అన్నారు. కడప జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి కేవలం ఉక్కు పరిశ్రమ వద్ద టెంకాయలు కొట్టడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లు సబ్సిడీలే కాక అధిక కరెంటు బిల్లులు ప్రజలపై భారం మోపడం సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాముల బ్రహ్మానంద రెడ్డి, నాయకులు, పాల్గొన్నారు.

గ్రామసభలతో భూసమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : గ్రామసభల ద్వారానే భూమి సమస్యలు పరిష్కా రం అవుతాయని తహసిల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల పరిధిలోని కుర్నూతుల అగ్రహారం సచివాలయంలో మంగళవారం గ్రామసభ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో మండల యువ నాయకుడు యనమల మదన్మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాసిల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నా రని, ప్రజల నుండి భూ సమస్యలు ఉన్నవారి నుండి రెవెన్యూ అధికారులు అర్జీలు స్వీకరించి గ్రామాలలో ఉన్నటువంటి రీ సర్వే తప్పులను,జాయింట్ నెంబర్లను, రెవెన్యూ సిబ్బంది సర్వేయర్ తో కలిసి మీ వద్దకే వచ్చి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ప్రజలు భూ సమస్యల కొరకు ఎంతో ప్రయాసతో అధికారుల వద్దకు వస్తారని వారి సమస్యను సావిదానంగా విని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో యనమల మదనమోహన్, మండల సర్వేయర్ మదన,రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేష్,గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు,తెలుగుదేశం పార్టీ నాయకులు రామాంజనేయులు,ఓబుల్ రెడ్డి,శివారెడ్డి, మోహన్, వెంకట రామిరెడ్డి, రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ లీగ్‌లో రాయల్ చాలెంజర్స్ జట్టు విజయం

విశాలాంధ్ర-మదనపల్లె:- విజయభారతి విద్యా సంస్థల వైస్ ప్రిన్సిపల్ సేతు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ లీగ్ లో రాయల్ చాలెంజర్స్ జట్టు విజయం సాధించింది. స్థానిక జిఆర్టీ స్కూల్ గ్రౌండ్ నందు విజయభారతి విద్యాసంస్థల ఆధ్వర్యం లో క్రికెట్ లీగ్ ను నిర్వహించారు. ఈ లీగ్ లో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొనగా వారికి నాలుగు లీగు మ్యాచ్ లు నిర్వహించారు. అనంతరం వాటిలో గెలిచిన జట్లకు రెండు సెమీ ఫైనల్ నిర్వహించారు. అనంతరం ఫైనల్స్ చేరిన వీబీ సూపర్ కింగ్స్ తో రాయల్ చాలెంజర్స్ జట్టు తలపడింది. ఫైనల్ మ్యాచ్ లో నిర్ణీత 5 ఓవర్ల లో ఆట ముగిసే సమయానికి తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 46 పరుగులు సాధించింది. లక్ష్య చేధనకు దిగిన వీబీ సూపర్ కింగ్స్ బ్యాట్స్ మెన్ దూకుడుగా ఆడి తమ జట్టును విజయతీరాలకు చేర్చే సమయంలో చివరి రెండు ఓవర్లలో బౌలర్లు తమ ఉత్తమ ప్రదర్శనతో వరుస వికెట్లు పడగొట్టి పరుగుల వరదను కట్టడి చేశారు. ఒకానొక దశలో వీబీ సూపర్ కింగ్స్ గెలుస్తుంది అనే ఉత్కంఠ పరిస్థితినుండీ రాయల్ చాలెంజర్స్ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్ తో మ్యాచ్ ను తమవైపుకు తిప్పారు. దీంతో నిర్ణీత 5 ఓవర్లు ముగిసే సమయానికి వీబీ సూపర్ కింగ్స్ 41 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో రాయల్ చాలెంజర్స్ జట్టు విజయం సాధించింది. అనంతరం మ్యాచ్ విన్నర్స్ కి ముఖ్య అతిదులుగా విచ్చేసిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు చల్లపల్లి నరసింహా రెడ్డి, విజయభారతి విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్ సేతు చేతుల మీదుగా కప్ లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో క్రీడలు మనో స్థైర్యాన్ని ఇస్తాయని, పోటీతత్వం పెంపొందుతుంది అని, రానున్న రోజుల్లో మరింత మెరుగ్గా ఇలాంటి పోటీలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ పాఠశాలల ప్రిన్సిపల్ చంద్ర శేఖర్ రెడ్డి, బీజేపి నాయకుడు బండి ఆనంద్, నరి బాబాయ్, గుడ్ విల్ అజయ్, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు మరింత లబ్ధి చేకూరేలా..!

ఆన్‌లైన్‌లో వివరాలు నమోదుకు శ్రీకారం- పథకాలు అనర్హులకు అందకుండా.. ఆర్పీలకు బాధ్యతలు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్వయం సహాయక సంఘాల్లోని (డ్వాక్రా) సభ్యుల కు మరింత లబ్ధి చేకూర్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుం టోంది. ఈ మేరకు సభ్యుల వివరాలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ చేసేందుకు శ్రీకారం చుట్టింది. మొత్తం సభ్యుల్లో ఎంత మంది ప్రభుత్వ పథకాలు తీసుకుంటున్నారు, ఎంత మందికి అందలం లేదు ఇప్పటి వరకు పొందిన లబ్ధి తదితర వివరాలను ప్రస్తుతం ఆర్పీలు (రిసోర్స్‌పర్సన్‌లు) సేకరించి ఆన్‌లైన్ చేస్తున్నారు. ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలో 642 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. ప్రస్తుతం పది మంది సభ్యులతో సంఘంగా ఏర్పడి పొదుపు చేయడంతో పాటు బ్యాంకుల నుండి రుణాలను తీసుకొని స్వయం ఉపాధిని పొందుతున్నారు. సభ్యుల్లో ఎవరైనా చనిపోయినా, వలస వెళ్లిపోయినా, వయస్సు మీరినా..వారి స్థానంలో కొత్త వారిని నియమించుకుంటున్నారు. ఆయా సభ్యుల వివరాలను ఇప్పటి వరకు ఆన్‌లైన్ చేయక పోవ డంతో ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సూపర్‌సిక్స్‌లో భాగంగా మహి ళలకు అమ్మకు వందనం వంటి పథకాలు అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులను తెలుసు కునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ విధానాన్ని తీసు కొచ్చింది.ఈ మేరకు పట్టణం లోని డ్వాక్రా సంఘాల నిర్వ హణను పరిశీలించే రిసోర్స్ పర్సన్లు ఆయా సంఘాల సభ్యు లతో సమావేశమవుతున్నారు. సంఘంలోని సభ్యుల ఆధార్, బ్యాంకుఖాతా, గ్యాస్ నెంబరు, బియ్యం కార్డు నకళ్ల వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో పాటు ఇప్పటి వరకు ఎంత పొదుపు చేశారు, బ్యాంకుల నుంచి ఎంత రుణం తీసుకున్నారు, తీసుకున్న రుణం ప్రతి నెలా చెల్లిస్తున్నారా లేదా ఇంకా ఎన్ని నెలల వాయిదా చెల్లించాల్సి ఉంది అనే వివరాలను కూడా నమోదు చేస్తున్నారు.

పథకాలు అనర్హులకు అందకుండా: ఆన్‌లైన్ విధానం వలన ప్రస్తుతం స్వయం సహాయక సంఘాల్లో సభ్యులు ఎంత మంది ఉన్నారు ఎంతమందికి పథకాలు అందుతున్నా యో తెలుసుకోవచ్చు. మృతులు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిని గుర్తించి తొలగించవచ్చు. తద్వారా పథకాలు అనర్హులకు అందకుండా నివారించవచ్చునని ప్రభుత్వం భావిస్తోంది. త్వరితగతిన యాప్‌లో వివరాలు నమోదు చేయాలని ఆదేశాలు రావడంతో సంబంధిత యంత్రాంగం ఆ దిశగా ముందుకు సాగుతున్నారు.

క్షేత్రస్థాయిలో జేసీ పరిశీలన

విశాలాంధ్ర-యర్రగుంట్ల : విజయ వాడ-బెంగుళూరు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే అలాగే చాగలమర్రి-రాయచోటి జాతీయ రహదారుల నిర్మాణం నేప థ్యంలో మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ క్షేత్రస్థాయి పరిశీల న జరిపారు. ఈ సందర్భంగా ఆమె చాగలమర్రి- రాయచోటి జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి పెద్దనపాడు గ్రామంలో నివాస గృహాల కు వేసిన మార్కింగ్ వంటి పలు అంశా లపై మండల తాహసీల్దార్ శోభన్‌బాబు ను అడిగి తెలుసుకున్నారు. తదనంత రం ఆమె ఆరువరుసల రహదారికి సంబంధించిన (గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే) పలు అంశాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి,మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశోక్ ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పులే మధుమేహానికి రక్షణ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : జీవనశైలి లో సరియైన మార్పులు, సాంప్రదాయ ఆహార నియమాలే మధు మేహానికి రక్షణ అని డాక్టర్ ఎం.ఎల్.ఎన్ ప్రసాద్ రాజు అన్నారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం నవంబర్ 14న పురస్కరించుకొని వరల్డ్ డయాబెటిక్ వీక్ కార్యక్రమంలో భాగంగా జన విజ్ఞాన వేదిక, ఎస్ కె ఆర్ అండ్ ఎస్ కె ఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలోజంతు శాస్త్ర విభాగము, ఎన్ఎస్ఎస్ యూనిట్లుఆధ్వర్యంలో మధుమేహ అవగాహన నిర్వ హించారు. ఆర్ శ్రీనివాసుల రెడ్డి తన మధుమేహ వ్యాధిపై రూపొందించిన ఛాయాచిత్రం పోస్టర్లను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి సలీం బాష, డాక్టర్ పి. శచీ దేవి జంతు శాస్త్ర అధ్యాపకురాలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, డాక్టర్ జి. విజయలక్ష్మి దేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, వాహిదా, డాక్టర్ రిజ్వానా, డాక్టర్ జి మీనా కుమారి, నాగ ముని రెడ్డి, నాగరత్నమ్మ, ఆనంద్ రెడ్డి, అనురాధ జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ అధ్యక్షుడు శివరాం,జిల్లా సమతా విభాగ కన్వీనర్ సునీత , డ్రాయింగ్ మాస్టర్ శీను పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
విలేకరులు కావలెను

విశాలాంధ్ర తెలుగు జాతీయ దినపత్రికలో కడప, అన్నమయ్య జిల్లాల్లో
దిగువ తెలిపిన మండలాల్లో పనిచేయుటకు స్థానికంగా ఉన్న అభ్యర్థులు కావలెను.
ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, తెలుగుభాషపై పరిజ్ఞానం ఉండాలి.

పనిచేయవలసిన మండలాలు :

కడపజిల్లా: కడప సిటీ, కమలాపురం, సి.కె. దిన్నె, వి.ఎన్.పల్లి, చక్రాయపేట, పెద్దముడియం, రాజుపాలెం, చాపాడు, పెండ్లిమర్రి, బి.కోడూరు, పులివెందుల రూరల్, లింగాల, జమ్మల మడుగు రూరల్, దువ్వూరు, సింహాద్రిపురం.

అన్నమయ్యజిల్లా: రాయచోటి రూరల్, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె, చిట్వేలు, రైల్వేకోడూరు రూరల్, చిన్నమండ్యం, కలకడ, కె.వి.పల్లి, కలికిరి, పిటియం, వాల్మీకిపురం, తంబళ్లపల్లి, కురబలకోట, మొలకలచెరువు, మదనపల్లి రూరల్, నిమ్మనపల్లి.

గమనిక: ఆయా మండలాల్లో స్థానికులై ఉండాలి

సంప్రదించవలసిన నెంబరు: 9985589444